
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
గురువారం 5 డిసెంబరు 2024



రెవెన్యూ సదస్సులు విజయవంతం చేయండి: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 6నుంచి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. సదస్సుల నిర్వహణ పై బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సదస్సుల్లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్వో విజయసారథి, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసుల దుర్భాషలు.. దాడి

అవమానంతో మహిళ ఆత్మహత్య

అక్రమ మద్యం విక్రయాల వివాదమే కారణం

వివరాలు మెయిన్‌లో..





కుమారి (ఫైల్), అనాథలుగా మారిన ఆమె కుమారులు

విరిగిపడిన మృత్యువు

మట్టి మిద్దె కూలి ముగ్గురి మృతి

నిర్మాణ దశలో షెడ్డు కూలి మరో ఇద్దరు..

ఉమ్మడి జిల్లాలో విషాదం నింపిన ఘటనలు

7



శివారెడ్డి మృతదేహం

శ్రమజీవుల కుటుంబం. ఉన్న కాస్త పొలంలో సేద్యం చేసుకుంటూ, కూలి పనులకు వెళుతూ సంతోషంగా గడిపేది. అమ్మ, కొడుకు, కోడలు, ఇద్దరు మనవరాళ్లు, ఓ మనవడు..! పెద్ద మనవరాలి పెళ్లి ఇటీవలే జరిపించారు. పాతకాలంనాటి మట్టిమిద్దె వారిది..! శిథిలావస్థకు చేరింది. కూటమి ప్రభుత్వం రావడంతో కొత్త ఇంటిని కట్టుకోవాలని అనుకున్నారు. గ్రామంలోని టీడీపీ నాయకుల సాయం కోరారు. వారు సరే అన్నారు. సంతోషంగా ఇంటికి వచ్చి, రాత్రి భోజనం ముగించారు. కాసేపు కబుర్లు చెప్పుకున్నారు. పొద్దున్నే పనికి పోవాలి..! ఇక నిద్రపోదాం అనుకున్నారు. అమ్మ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని పడుకుంది. కొడుకు, కోడలు, మనవరాలు బయట వరండాలో పడుకున్నాడు. ఏ అర్ధరాత్రో మిద్దె ముందుభాగం కూలిపోయింది. అమ్మ మినహా.. అందరూ శిథిలాలలో కూరుకుపోయారు. 'కొత్త ఇల్లు' అనగానే.. పాత మిద్దెకు కోపం వచ్చినట్లుంది. ఇన్నాళ్లూ నీడనిచ్చిన గూడు.. వారికి సమాధి కట్టింది. ఆ విషాదాన్ని చూసి ఊరు కన్నీరుపెట్టింది.



కుప్పకూలిన ఇంటి పైకప్పు

మనిషి తప్పు... మట్టికి ముప్పు..!



- విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం
- నిస్సారమవుతున్న నేలలు
- సంరక్షించుకోకపోతే... మనుగడకే ముప్పు
- నేడు ప్రపంచ మృత్తికా దినోత్సవం



టమోటా పంటకు పురుగు మందు కొడుతున్న రైతు

తనకల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అన్నం పెడుతున్న పుడమి పొట్టలోకి విషం పంపుతున్నాం. వ్యవసాయంలో విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తూ నేలను చేజేతులా నిస్సారం చేసుకుంటున్నాం. కలుషితం చేస్తున్నాం. ఇది ఇలాగే కొనసాగితే, నేల పరిరక్షణకు చర్యలు చేపట్టకపోతే మానవ మనుగడకే పెనుముప్పు తప్పదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అందరూ మేల్కోవాలని వారు సూచిస్తున్నారు. ఈనేపథ్యంలో నేల పరిరక్షణ అందరి బాధ్యతగా గ్రహించాలి. అప్పుడే ఇది సాధ్యమవుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. గురువారం ప్రపంచ మృత్తికా దినోత్సవం సందర్భంగా.. నేల పరిరక్షణపై తెలుసుకుందాం.

వాతావరణంలో విపరీత మార్పులు

మానవ మనుగడకు ఆధారంగా ఉన్న మట్టి (నేల) నేడు పనికిరాకుండా పోతోంది. పొట్టిరకాల సేద్యాలు, విద్యుత్ అందుబాటులోకి రావడం, నీటి వనరులను స్వయంగా రైతులు సృష్టించుకోవడం తదితర కారణాల వలన భూవినియోగం పెరిగింది. ఒకప్పుడు వర్షాధార పంటలు పండించే నేలల్లో సైతం ప్రస్తుతం బోరుబావుల కింద పంటలు సాగుచేస్తున్నారు. అధిక దిగుబడులు సాధించేందుకు విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తున్నారు. టమోటా, దోస, కర్బూజా తదితర వాణిజ్య పంటలు సాగుచేస్తూ విచ్చలవిడిగా కలుపు నివారణ, క్రిమిసంహారక మందులు, రసాయన ఎరువులు ఉపయోగిస్తున్నారు. ఫలితంగా నేలల్లో కర్బన్ శాతం తగ్గిపోయింది. ఉమ్మడి కుటుంబాలు లేకపోవడంతో రైతులు పశుపోషణకు క్రమేపీ దూరమయ్యారు. దీంతో వ్యవసాయంలో పశువుల ఎరువుల వినియోగం నానాటికీ తగ్గిపోతోంది. రసాయనాలు, క్రిమిసంహారక ఎరువుల వినియోగం పెరిగిపోతూ వచ్చింది. ఓవైపు అడవులు అంతరించిపోతుండడం, మరోవైపు జనాభా పెరుగుతుండడంతో పచ్చిక బయళ్లు, చిన్న చిన్న గుట్టలు సైతం వ్యవసాయ భూములుగా మారిపోతున్నాయి. దీంతో వాతావరణంలో మార్పులు విపరీతంగా సంభవిస్తున్నాయి. అధిక వేడి, ఒకేసారి అత్యధిక వర్షపాతం కురవడం ద్వారా కూడా మట్టి అధికంగా కొట్టుకుపోయి సహజనీటి వనరులైన చెరువులు, కుంటలు పూడిపోతున్నాయి. విచ్చలవిడిగా పురుగుమందులు, రసాయన ఎరువులు ఉపయోగిస్తుండడంతో భూమిలో కర్బన్ శాతం తగ్గిపోయి, నిస్సారమవుతోంది. భూమిసారం పెంచడానికి ఉపయోగపడే వానపాములు, మిత్ర పురుగులు, పోషకాలు తగ్గిపోయాయి. దీంతో భూములు గట్టిపడి నీరు ఇంకని పరిస్థితి దాపురించింది. విచక్షణారహితంగా కలుపు మొక్కల నివారణ మందులు పిచికారీ చేస్తుండడం, పంటలకు విచ్చలవిడిగా పురుగు మందులు వినియోగించడంతో అవి గడ్డిలో కలిసిపోతున్నాయి. ఆ గడ్డిని పశువులు తినడం వలన అవి ఇచ్చే పాలు సైతం కలుషితమవుతున్నాయి. తద్వారా ప్రజలు రోగాల బారిన పడుతున్నట్లు పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. పురుగుమందులను అధిక మోతాదులో ఉపయోగించడంతో వర్షాలు కురిసినపుడు నీటిలో కలిసిపోతున్నాయి. తద్వారా 2050 నాటి సహజ నీటి వనరులు సైతం కలుషితమవుతాయని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. భూగర్భజలాలు సైతం కలుషితం కాక తప్పదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ ఉపయోగించడం ద్వారా భూమిలో కరిగిపోక, ఏళ్ల తరబడి అలాగే ఉంటుండడంతో నేలలు సారాన్ని కోల్పోతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నా పట్టించుకునేవారే లేరు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే పెనుముప్పు తప్పదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో నేలల పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

2050 నాటికి నీటి వనరులు సైతం కలుషితం అవుతాయి..



రైతులు విచ్చలవిడిగా ఉపయోగిస్తున్న రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల అవశేషాలు భూమిపై పేరుకుపోతాయి. వర్షాలు కురిసినపుడు భూమిలోకి ఇంకి, సహజ వనరుల్లో కలిసిపోతాయి. తద్వారా అవికూడా కలుషితమవుతాయి. రైతుల్లో చైతన్యం తీసుకురావడం ద్వారా నేలల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. లేదంటే మానవ మనుగడకు ముప్పు తప్పదు.

- అనిత, శాస్త్రవేత్త, కదిరి పరిశోధన స్థానం

పట్టా లేకున్నా.. ఇంటి నిర్మాణం..!

- వైసీపీ నాయకుడి ఇష్టారాజ్యం
- ఫిర్యాదులతో అధికారుల చర్యలు
- అక్రమ కట్టడం కూల్చివేత



అక్రమ కట్టడాన్ని కూల్చేస్తున్న దృశ్యం

కొత్తచెరువు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ధర్మవరం ప్రధాన రహదారి పక్కన వైసీపీ నాయకుడు ఏకంగా ఇంటి పట్టా ఇవ్వకుండానే ఇష్టారాజ్యంగా నిర్మాణం చేపట్టాడు. పేదలకు పంపిణీ చేసిన స్థలంలో దౌర్జన్యంగా నిర్మించుకుంటున్నాడు. దీనిపై ఫిర్యాదులు అందడంతో అధికారులు బుధవారం కూల్చివేశారు. ధర్మవరం ప్రధాన రహదారి పక్కన 348 సర్వే నంబరులో పేదలకు ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. అందులో కొందరు వైసీపీ నాయకులు పట్టాలు లేకుండానే అక్రమ నిర్మాణాలు చేపట్టారు. వైసీపీ పట్టణ కన్వీనర్ ముద్దల భాస్కర్ ప్లాట్ నంబరు 248లో పట్టా లేకుండానే ఇల్లు నిర్మిస్తున్నాడు. దీనిపై కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో వారు క్షేత్రస్థాయిలో విచారించగా అది అక్రమ కట్టడమేనని తేలింది. ఈ నేపథ్యంలో ఆర్డీఓ సువర్ణ, తహసీల్దార్ నీలకంఠారెడ్డి, సీఐ ఇందిర ఆధ్వర్యంలో ఆ కట్టడాన్ని పాక్షికంగా కూల్చివేశారు. తొలగింపును బాధిత కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. ఒకానొక సమయంలో ఎక్స్‌కవేటర్ కింద పడుకుని, నిరసన చేపట్టారు. ఆర్డీఓ సువర్ణ మాట్లాడుతూ... నిర్మాణం చేపట్టరాదని గతంలోనే నోటీసులు జారీ చేశామనీ, వాటిని ఉల్లంఘించి పనులు చేస్తుండడంతో తొలగిస్తున్నామన్నారు.



రైతు స్వేదం చిందించి
పంట పండించాడు..
కోత వేసి.. నూర్పిడి చేశాడు..
ధాన్యపు రాసులను
చూసి మురిసిపోయాడు.
విక్రయించడమే తరువాయి..
ఆఖరి క్షణంలో వారి ఆశలపై
వరుణుడు నీళ్లు కుమ్మరించాడు..
తుఫాను వర్షాలకు
వడ్లు తడిసిపోతున్నాయి..
టార్పాలిన్లు కప్పినా..
ప్రయోజనం లేదు..
ఇదేమి దౌర్భాగ్యం అంటూ
అన్నదాత వాపోతున్నాడు..
ధాన్యాన్ని ఎలా ఆరబెట్టుకోవాలో..
నాణ్యత తగ్గితే
ఎలా అమ్ముకోవాలోనని..
అయోమయంలో పడ్డాడు..

కల్లాల్లో కన్నీళ్లు..!



- వరి పంటను నూర్పిడి చేసుకున్న రైతులు
- కల్లాల్లో ధాన్యం వర్షాలకు తడిసిపోతున్న వైనం
- సర్వం నష్టపోతున్న అన్నదాతలు



గోరంట్ల మండలంలో వరిధాన్యం కల్లాన్ని ముంచెత్తిన వర్షపునీరు



పుట్టపర్తి వద్ద టార్పాలిన్ల కింద వరి ధాన్యం



ధర్మవరం మండలం గరుడంపల్లి వద్ద తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు ఆంజనేయులు

పుట్టపర్తి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తూఫాను తీరం దాటి నాలుగు రోజులైంది. అయినా రైతన్నను వెంటాడుతోంది. జిల్లావ్యాప్తంగా మంగళ, బుధవారాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురిశాయి. కొన్నిచోట్ల చిరుజల్లులు పడ్డాయి. ఈనేపథ్యంలో వేల ఎకరాల్లో కోతకు వచ్చిన వరి పంట నేలవాలగా.. నూర్పిళ్లు చేసి కల్లాల్లో టార్పాలిన్లు కప్పిన ధాన్యం తడిసిపోయింది. కల్లాల్లో రహదారులపై ఉన్నా ధాన్యం ఆరబెట్టి బయటకు తీసి విక్రయించడానికి సాధ్యం కావడంలేదు. మబ్బులు తెరపి ఇచ్చేదాకా ధాన్యాన్ని ఆరబెట్టుకునే అవకాశం లేదు.

నేలవాలుతున్న ఆశలు

జిల్లాలో ఖరీఫ్‌లో సాగుచేసిన రైతన్నను తుఫాన్లు వెంటాడుతున్నాయి. ఫెంగల్ తుఫాను దెబ్బకు కోతకొచ్చిన వరి పంట పలు మండలాల్లో నేలవాలింది. ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా 9160 హెక్టార్లలో వరి సాగు చేశారు. అక్కడక్కడ కోతలు వేశారు. 60 శాతందాకా పంట కోత, గింజదశలో ఉంది. అక్టోబరు మూడోవారంలో అల్పపీడన వర్షం బీభత్సానికి వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరి, వేరుశనగ, మొక్కజొన్న, కంది, పత్తి, టమోటా, అరటి, బంతిపూలు, మిర్చి, ద్రాక్ష, ఉల్లి, చిక్కుడు, వంగ తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తాజాగా ఫెంగల్ తుఫాను దెబ్బకు పలుచోట్ల కోతకొచ్చిన పంట నేలవాలింది. గతనెల 30వ తేదీ అర్ధరాత్రి తుఫాను పుదుచ్చేరి సమీపంలో తీరం దాటింది. నాలుగురోజులైనా జిల్లాలో వాతావరణం మబ్బులతో భయపెడుతోంది. కోత వేసిన పంట ధాన్యం వారం రోజులుగా కల్లాలు, రోడ్లపైనే ఉంది. టార్పాలిన్లు కప్పి రైతులు జాగారం చేస్తున్నారు. వర్షం, మబ్బులు కారణంగా వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేయడంలేదు. ఎప్పుడు ఎండ వస్తుందా, కల్లాల్లో ధాన్యం ఆరబెట్టి, కోతకొచ్చిన పంట నూర్పిళ్లు చేసుకుందామా అని ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. కల్లాల్లో టార్పాలిన్లు కప్పిన ధాన్యం తేమ పెరిగి, మొలకలు వస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. కోతకొచ్చిన వరి పంట అక్కడక్కడా వాలిపోయిందనీ, ఎక్కడా నష్టం వాటిల్లలేదని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం రైతులు నష్టపోయారు.

కల్లాల్లోనే ధాన్యం

ఒకటిన్నర ఎకరాలో వరి పంటను కోసి, తొమ్మిదిరోజుల క్రితం నూర్పిడి చేశా. తుఫాను ప్రభావంతో ధాన్యం ఆరబోసేందుకు ఏడు కిలోమీటర్లు తీసుకువచ్చి కప్పలబండపారిశ్రామిక వాడలో రోడ్డుపై పోసి టార్పాలిన్లు కప్పా. నేటికీ అలాగే ఉంచి, ధాన్యానికి రాత్రింబవళ్లు కాపలా ఉండాల్సివస్తోంది. వడ్లు మొలకలొస్తున్నాయి.

- కేశప్ప, వరి రైతు, ఎనుములపల్లి



వరి ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు కేశప్ప

బాలికా విద్య అంతా మిథ్య..!



పాఠశాల సమయంలో ఆటలాడుతున్న విద్యార్థినులు

- 20 రోజులుగా సమ్మెలో టీచర్లు
- బోధనకు దూరమైన విద్యార్థినులు
- ఆటపాటలతో కాలక్షేపం
- గిరిజన గురుకుల పాఠశాలలో దైన్యం

తనకల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బాలికావిద్యకు ప్రభుత్వాలు ఎంతో ప్రాధాన్యమిస్తున్నాయి. ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో మాత్రం బాలికావిద్య.. అంతా మిథ్యే అవుతోంది. మండలంలోని చెన్నరాయస్వామి గుడి ప్రాజెక్టు (సీజీపీ) వద్ద గిరిజన బాలికల గురుకుల పాఠశాల ఉంది. ఇందులో ఐదు తరగతుల్లో ఏకంగా 460 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. 20 మంది టీచర్లు పనిచేస్తున్నారు. వీరిలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తప్ప.. అందరూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే. 12వ పీఆర్సీ ఇవ్వాలనీ, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్లతో 19 మంది అవుట్ సోర్సింగ్ టీచర్లు సమ్మెలోకి వెళ్లారు. 20 రోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో పాఠశాలలో బోధన లేకుండాపోయింది. విద్యార్థినుల్లో పదో తరగతి వారు కూడా ఉన్నారు. వారికి పబ్లిక్ పరీక్షలు దగ్గరపడుతున్నాయి. ఈ సమయంలో బోధించేవారు లేక ఇబ్బందులు పడుతున్నారు. కీలక సమయం వృథా అవుతోందనీ, ఇలా అయితే తమ పిల్లలు ఎలా ఉత్తీర్ణులవుతారని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఒక్కరే 460 మంది విద్యార్థినులను అదుపు చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలలో విద్యాబోధన కొనసాగేలా చూడాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు.



డిజిటల్ పాఠాలు వింటున్న విద్యార్థినులు

డిజిటల్ తరగతులతో నెట్టుకొస్తున్నా..



పాఠశాలలో పనిచేస్తున్న 19 మంది అవుట్ సోర్సింగ్ టీచర్లు 20 రోజులుగా సమ్మెచేస్తున్నారు. 460 మంది బాలికలను అదుపుచేయలేకపోతున్నా. డిజిటల్ తరగతులు నిర్వహిస్తూ నెట్టుకొస్తున్నా.

-సుష్మితాజ్యోత్స్న, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

సభ్యత్వ నమోదులో అగ్రస్థానం వైపు..

పుట్టపర్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే అగ్రస్థానం వైపు జిల్లా దూసుకెళ్తోంది. బుధవారం నాటికి 3,77,123 సభ్యత్వాల నమోదుతో రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిచింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 4.8 లక్షల క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి వరుసలో కదిరి తర్వాత మడకశిర, రాప్తాడు, పెనుకొండ, ధర్మవరం, పుట్టపర్తి, హిందూపురం నియోజకవర్గాలు ఉన్నాయి. రాష్ట్రంలో మొదటి స్థానం వైపు దూసుకెళ్తున్న నేపథ్యంలో బుధవారం రామగిరి మండలం వెంకటాపురంలో ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, కదిరిలో కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో సంబరాలు చేశారు. సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో నిలవడం మంత్రులు, టీడీపీ శాసనసభ్యులు, ఎంపీ, నాయకులు, కార్యకర్తల, మండల కన్వీనర్లు, క్లస్టర్ బూత్ కన్వీనర్ల సమష్టి కృషి తోనే సాధ్యమైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డె అంజినప్ప వెల్లడించారు.

భారత ఫుట్‌బాల్ ప్రాబబుల్స్‌కు అనూష

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ అండర్-20 భారత మహిళా జట్టు ప్రాబబుల్స్‌కు జిల్లాకు చెందిన క్రీడాకారిణి అనూష ఎంపికయ్యారు. ఆత్మకూరు గ్రామానికి చెందిన అనూష ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. ఇప్పటికే ఆమె అనేక రాష్ట్ర, జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. గతేడాది కూడా అండర్-19 భారత మహిళా ఫుట్‌బాల్ జట్టు ప్రాబబుల్స్‌లో ఆమె చోటు సంపాదించారు. ప్రస్తుతం ఆమె ఆర్డీటీ ఫుట్‌బాల్ అకాడమీలో రెసిడెన్షియల్ సాధన చేస్తున్నారు. భారత జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపిక కావడంతో బెంగళూరులో నిర్వహిస్తున్న శిక్షణా శిబిరానికి వెళ్లారు. అనూషాను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ అభినందించారు.


అనూష

రోశయ్యకు భారతరత్న ప్రకటించాలి

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకుడు గోపా మచ్చా నరసింహులు


రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రోశయ్యకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని ఆర్యవైశ్య మహాసభ నాయకుడు, కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు డిమాండ్ చేశారు. కొణిజేటి రోశయ్య మూడో వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కల్యాణమండపంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోశయ్య జన్మించిన గుంటూరు జిల్లాకు ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సప్తగిరి సర్కిల్ లోని వైశ్య హాస్టల్‌లో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తూరు ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్, కార్యదర్శి టంగుటూరు నాగభూషణ, సత్రసాల కిషోర్, తల్లం మురళీకృష్ణ, కృష్ణం రఘు, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

హనకనహాళ్‌లో ప్రబలిన జ్వరాలు

కణేకల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనకనహాళ్ గ్రామంలో జ్వరాలు ప్రబలడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల నుంచి గ్రామంలో జ్వరాల తీవ్రత పెరగింది. దీంతో బాధితులు చికిత్స కోసం బెళుగుప్ప, కళ్యాణదుర్గం ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. గ్రామానికి చెందిన రామాంజనేయులు, వరుణ్‌తేజ్, జ్యోత్స్న, తిమ్మరాజు తదితరులకు మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు రావడంతో కళ్యాణదుర్గంలో చికిత్సలు పొంది బుధవారం గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో ప్రతి ఇంట్లోను జ్వర పీడితులు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. వైద్యాధికారులు స్పందించి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


జ్యోత్స్న


రామాంజనేయులు


తిమ్మరాజులు


వరుణ్‌తేజ్

మట్టిలో మాణిక్యాలు

ఆట ఏదైనా విజయం వారిదే..

ఆ పాఠశాల విద్యార్థులు బరిలోకి దిగితే పతకం కొట్టాల్సిందే. ప్రత్యర్థి ఎవరైనా విజయం మాత్రం వారిదే. ఇదేదో పట్టణాలు, నగరాల్లో పేరొందిన కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థుల ప్రతిభ మాత్రం కాదు. జిల్లాలోని మారుమూల గ్రామం నూతిమడుగు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆటల్లో అద్భుతమైన ప్రతిభ చూపుతున్నారు. పీడీ కోచింగ్, ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పతకాలు పట్టేస్తున్నారు. మెరుగైన ఆటతీరుతో జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబరు, నవంబరు నెలల్లో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వివిధ కేటగిరీల్లో ఈ పాఠశాల విద్యార్థులు 43 మంది అద్భుత ప్రదర్శన చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. -ఆంధ్రజ్యోతి, కళ్యాణదుర్గం




ఇటీవల రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నూతిమడుగు పాఠశాల విద్యార్థులు





రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు
క్రీడల్లో రాణిస్తున్న నూతిమడుగు విద్యార్థులు

జాతీయ స్థాయిలో ఆడుతా: ఖాసీం, తొమ్మిదో తరగతి



ఈ ఏడాది వాలీబాల్, సాఫ్ట్‌బాల్ గేమ్‌లలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. భవిష్యత్తులో సాఫ్ట్‌బాల్ గేమ్‌లో జాతీయ జట్టులో స్థానం సంపాదించడం లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నా. ఎప్పటికైనా జాతీయ స్థాయిలో ఆడుతా.

ఖోఖోలో జాతీయస్థాయిలో రాణిస్తా



ఈ నెల 6 నుంచి 8 వరకు చిత్తూరులో జరిగే ఖోఖో రాష్ట్రస్థాయి అండర్-19 పోటీల్లో పాల్గొనబోతున్నా. అక్కడ బాగా రాణించి జాతీయ జట్టులో స్థానం సంపాదించడమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నా.
-ప్రణవి, ఎనిమిదో తరగతి

మెడికల్ సీట్ సంపాదించడమే లక్ష్యం



సాఫ్ట్‌బాల్ గేమ్‌లో మూడు సార్లు రాష్ట్ర స్థాయిలో పాల్గొన్నా. మా పీడీలు ఓబులేసు, సంజీవరాయుడు ఇచ్చిన శిక్షణతో జాతీయ స్థాయిలో కూడా ఒకసారి పాల్గొన్నా. భవిష్యత్తులో క్రీడల ద్వారా మెడికల్ సీట్ సంపాదించటమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నా.
-ఆశాబేగం, తొమ్మిదో తరగతి

మూడుసార్లు రాష్ట్రస్థాయిలో ఆడా



సాఫ్ట్‌బాల్ గేమ్‌లో మూడు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా. జాతీయ జట్టులో స్థానం కోసం ప్రాక్టీస్ చేస్తున్నా. పీడీలు ఓబుళపతి, సంజీవరాయుడు నాతో రోజు ప్రాక్టీస్ చేయించి, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందేలా తీర్చిదిద్దారు.
-వసంత్, పదో తరగతి

రెండేళ్ల నుంచి రాష్ట్రస్థాయికి 70 మంది..

గత రెండేళ్ల నుంచి ఈ పాఠశాల్లో విద్యార్థిని, విద్యార్థులు 70 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఖోఖో, వాలీబాల్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, హ్యాండ్‌బ్యాల్, ఆర్చరీ (విలువిద్య), వెయిట్ లిఫ్టింగ్ తదితర క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపికై ఈ పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చారు. జిల్లా స్థాయిలో కూడా నూతిమడుగు ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి గుర్తింపు పొందారు. గత రెండుమూడేళ్లలోనే దాదాపు 250 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై అక్కడ కూడా అత్యున్నత ప్రతిభాపాటవాలు సాధించారు. 8, 9, 10వ తరగతికి చెందిన 44 మందికి పైబడి బాలురు, 30 మందికి పైబడి బాలికలు కూడా వివిధ ఆటల్లో తమ ప్రతిభ చూపుతున్నారు. బాలికలు కూడా బాలురతో సమానంగా క్రీడల్లో పాల్గొనేందుకు ముందుకు రావడం ఇక్కడ విశేషం.

అందరూ గ్రామీణ విద్యార్థులే

ఈ పాఠశాల్లో చదివే విద్యార్థులందరూ గ్రామీణ ప్రాంత విద్యార్థులే. ఈ పాఠశాల పరిధిలో ఏడు మారుమూల గ్రామాల పరిధిలోని విద్యార్థులు ఉన్నారు. ఈ పిల్లలు కేవలం చదువులోనే కాకుండా ఆటల్లో సైతం ఆసక్తి కనబరిచి, వివిధ స్థాయి పోటీల్లో పాల్గొంటూ పాఠశాలకు గుర్తింపు తెస్తున్నారు. ఈ పాఠశాలకు చెందిన 300 మంది విద్యార్థులు ప్రతిరోజు పలు క్రీడల్లో ప్రాక్టీస్ చేస్తుంటారు. ప్రతి రోజు మధ్యాహ్నం తర్వాత పలు క్రీడల్లో ప్రాక్టీస్ చేస్తుంటారు. నిత్య సాధనతోనే విజయాలు సాధ్యమవుతున్నాయని పాఠశాల పీడీలు చెబుతున్నారు.

విజయాల వెనుక ఇద్దరు పీడీలు

ఒకప్పుడు ఈ పాఠశాలలో పిల్లలకు ఆసక్తి ఉన్నా క్రీడలకు అంతగా ప్రాధాన్యం ఉండేది కాదు. పీడీలు ఉన్నా ఏదో సాధారణంగా గడిచిపోయేది. కాని రెండేళ్ల కిందట ఇక్కడ పీడీలుగా ఓబుళపతి, సంజీవరాయుడు బాధ్యతలు తీసుకున్నారు. అప్పటి నుంచి ఆటల్లో పాఠశాల తీరే మారిపోయింది. వారిద్దరూ కలిసి మట్టిలో మాణిక్యాలను గుర్తించి, తమ శిక్షణతో సానపట్టారు. దాని ఫలితమే ఇప్పుడు వస్తున్న పతకాలు అని పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. వివిధ క్రీడల గురించి, అందులోని మెలకువల గురించి ఎప్పటికప్పుడు వివరించి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటేలా చూస్తున్నారు. ఇదే స్ఫూర్తితోనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా రాణించగలమని విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పేర్కొన్నారు. అయితే పాఠశాలకు సరైన మైదానం లేకపోవడం ఇబ్బందికరంగా ఉంది. దాతలు ముందుకు వచ్చి క్రీడామైదానాన్ని బాగు చేయించి, క్రీడలకు సహకరిస్తే ఇక్కడి విద్యార్థులు అద్భుతాలు చేయగలరని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



70 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడారు



నేను, ఇక్కడ పనిచేసే మరో పీడీ సంజీవరాయుడు ఇద్దరం రెండేళ్ల కిందట ఈ పాఠశాలకు వచ్చాం. అప్పటి నుంచి సుమారు 70 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఒక అమ్మాయి జాతీయ స్థాయి జట్టుకు ఎంపికయ్యింది. ఖోఖో, వాలీబాల్, సాఫ్ట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, హ్యాండ్ బాల్, ఆర్చరీ (విలు విద్య), వెయిట్ లిఫ్టింగ్ వంటి క్రీడల్లో రెండేళ్ల నుంచి తర్ఫీదు ఇస్తున్నాం. ఆర్చరీ వంటి పురాతన క్రీడ ఈ పాఠశాలలో ఉండటం ఒక విశేషం. ఎంతో ఖరీదైన ఆటలు అయిన ఆర్చరీ, సాఫ్ట్‌బాల్ వంటి క్రీడల్లో రాష్ట్రస్థాయిలో ఈ పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనడం ఎంతో సంతోషించదగ్గ విషయం.
- ఓబులేసు, పీడీ, ఉన్నత పాఠశాల, నూతిమడుగు, కంబదూరు మండలం

అడ్మిషన్ దొరికితే చాలు

పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 716 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో అడ్మిషన్ దొరికితే చాలని తల్లిదండ్రులు ఎగబడుతుంటారు. ఈ ఏడాదే అన్ని తరగతుల్లో కలిపి 270 మంది అడ్మిషన్ పొందారు. దీన్ని బట్టే పాఠశాల స్థాయిని తెలుసుకోవచ్చు. క్రీడలతో పాటు, చదువులో కూడా పాఠశాల విద్యార్థులు రాణిస్తున్నారు. ఈ పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీ, పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ, ఆర్డీటీ సెట్‌లో కూడా ఉత్తమ ప్రతిభ చూపి పాఠశాలకు మంచి గుర్తింపు తెచ్చారు. పదో తరగతిలో కూడా మంచి ఫలితాలు వస్తుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్చడానికి ఆసక్తి చూపుతున్నారు.

దాతలు సహకరించాలి



నేను రెండేళ్ల నుంచి హెచ్ఎంగా ఈ పాఠశాలలో పనిచేస్తున్నా. పీడీలు ఓబుళపతి, సంజీవరాయుడు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, మంచి శిక్షణ ఇవ్వడంతోనే ఇంతటి విజయానికి సాధ్యం అయింది. దాతలు ముందుకు వచ్చి మరింత క్రీడాసామగ్రిని సమకూర్చినట్లయితే జాతీయ స్థాయిలో విద్యార్థినీవిద్యార్థులను తీసుకెళ్లేందుకు కష్టపడతాం.
-రాజశేఖర్‌రెడ్డి, హెచ్ఎం

కోతలు లేని విద్యుత్ సరఫరా

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు

అనంతపురం రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కోతలు లేని విద్యుత్ సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు విద్యుత్ అధికారులను ఆదేశించారు. నగరంలోని జిల్లా విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన ఉమ్మడి జిల్లాలోని విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈలు సంపత్‌కుమార్, సురేంద్రతో కలిసి ఆయన అన్ని అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ అంతరాయలను పూర్తిగా నివారించాలన్నారు. వేసవి ప్రారంభంలోపు వినియోగదారులకు కరెంటు సమస్య తలెత్తకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలన్నారు. లోఓల్టేజ్, హైఓల్టేజ్ సమస్యలను గుర్తించి వాటి పరిష్కరించాలని ఆదేశించారు. అవసరం మేరకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. పాత లైన్ల స్థానంలో కొత్త లైన్ లాగేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ కలెక్షన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించిన సామగ్రి ఈనెల చివరికి వస్తుందన్నారు. అప్పటికి ఎస్టిమేషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలు నివారించేందుకు వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఏఓ బాలాజీ వెంకటేష్, ఈఈలు ప్రసాద్, రాజశేఖర్, జేవీ రమేష్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు డీపీఆర్సీలో శిక్షణ

అనంతపురం విద్య, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అంశంపై శిక్షణ ఇవ్వనున్నట్లు జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 5,6 తేదీల్లో జడ్పీ కార్యాలయంలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం(డీపీఆర్సీ)లో ఈ శిక్షణ ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో రెండు బ్యాచ్‌లకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయి ట్రైనర్లు అయిన ఈవోఆర్డీలు, పంచాతీయ కార్యదర్శులు, ఎంపీహెచ్ఓలు, ఏపీఎంలు, పంచాయతీరాజ్ ఏఈలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. జిల్లాస్థాయి శిక్షణ తర్వాత ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకూ మండలాల్లోని ప్రజాప్రతినిధులకు, పంచాయతీ కార్యదర్శులకు, మండల స్థాయి అధికారులకు శిక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.


మజ్దూర్ యూనియన్ శిబిరం


ఎంప్లాయీస్ సంఘ్ శిబిరం

ప్రారంభమైన రైల్వే ఉద్యోగ సంఘ గుర్తింపు ఎన్నికలు

గుంతకల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగ సంఘ గుర్తింపు ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కార్యక్రమం బుధవారం ప్రారంభం అయ్యింది. రైల్వే ఉద్యోగుల ఓటింగ్ కార్యక్రమం ఈనెల 4, 5, 6 తేదీల్లో చేపట్టనున్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్ వ్యాప్తంగా 34 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. డివిజనల్ కేంద్రమైన గుంతకల్లులో 6 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. డివిజన్‌లో 14,359 ఓట్లు ఉండగా, సాయంత్రందాకా నిర్వహించిన పోలింగ్‌లో 7,591 ఓట్లు పోలయ్యాయి. మొదటి రోజు సాయంత్రానికి 52.87 శాతం పోలింగ్ నమోదైనట్లు పర్సనల్ శాఖాధికారులు తెలియజేశారు. పోలింగ్ సందర్భంగా రైల్వే ఏరియాలో మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యాల్లో ఓటింగ్ సహాయక శిబిరాలను ఏర్పాటు చేశారు. సాయంత్రం వరకూ రైల్వే ఇన్‌స్టిట్యూట్, డీఆర్ఎం కార్యాలయాల వద్ద ఉద్యోగుల కోలాహలం కనిపించింది. ఓటింగ్ కార్యక్రమాన్ని డీఆర్ఎం విజయ కుమార్, సీనియర్ డీపీఓ జేఎస్ చౌహాన్, తదితర ఎన్నికల అధికారులు, యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్, సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్, ఏడీఎస్ కే మల్లికార్జున, తదితరులు పర్యవేక్షించారు.

తెగుళ్ల ఉధృతి

కందికి పచ్చపురుగు, పప్పుశనగకు వేరుకుళ్లు

ఆవిరవుతున్న రైతన్న ఆశలు






కందిపూత దశలోనే ఆశించిన పురుగు, కాయను తొలుస్తున్న పచ్చపురుగు, వేరుకుళ్లు తెగులుతో నాశనమైన పప్పుశనగ

బెళుగుప్ప, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెగుళ్ల ఉధృతి అధికంగా ఉండటంతో కంది, పప్పుశనగ రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. పూత దశలో ఉన్న కంది పంటను పచ్చపురుగు ఆశించింది. పూత, పిందెలను తినేస్తోంది. నివారణకు వేలాది రూపాయలు వెచ్చించి పురుగుమందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. పురుగు నివారణకు క్లోరంట్రినిల్‌ప్రోల్ ఎకరాకు 60 ఎంఎల్ లేదా సైనోశాడ్ 60 ఎంఎల్, ప్రొటానోపాస్ 400 ఎకరాకు 400 ఎంఎల్, బెంజోయేట్ ఎకరాకు 80 ఎంఎల్ మందులు పిచికారి చేయాలని వ్యవసాయాధికారి పృథ్వీసాగర్ సూచించారు. మండలంలో 16,600 ఎకరాలలో పప్పుశనగ సాగు చేశారు. అయితే తేమ అధికావడంతో వేరుకుళ్ల వ్యాధి సోకి మొక్కన్నీ చనిపోతున్నాయి. నివారణకు సాఫ్ లేదా హెక్సా కోనజోల్ లేదా ప్రాపికోనోజోల్ ఎకరానికి 400 గ్రాముల పిచికారీ చేయాలని వ్యవసాయాధికారి పేర్కొన్నారు. మొక్క పూర్తిగా తడిసేలా పిచికారీ చేయాలని, తేమశాతం ఎక్కువగా ఉన్నందున మొక్కల వేళ్లు నల్లగా వుండి పైరు నాశనమవుతోందని ఏవో తెలిపారు.

ఆశలన్నీ నీరుగారుతున్నాయి



కంది, పప్పుశనగ పంటలపై పెట్టుకున్న ఆశలన్నీ నీరుగారుతున్నాయి. కందికి పచ్చపురుగు, పప్పుశనగకు వేరుకుళ్లు సోకడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. 30 ఎకరాల్లో కంది, 20 ఎకరాల్లో పప్పుశనగ పంటలు సాగు చేశా. వర్షాలు కురిసినా ప్రయోజనం లేకుండా పోయింది. దిక్కుతోచడం లేదు. దేవుడు కరుణించి వాతావరణం అనుకూలిస్తేనే గట్టెక్కే అవకాశం ఉంటుంది. **-యర్రిస్వామి, రైతు, ఎర్రగుడి**

చిరస్మరణీయుడు ఘంటసాల

వెంకటేశ్వరరావుకు ఘన నివాళి


ఘంటసాల విగ్రహం వద్ద కళాకారుల నివాళి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 4(ఆంధ్ర జ్యోతి): తన గాన మాధుర్యంతో తెలుగు సినీ సంగీత ప్రియులను అలరించిన ఘంటసాల చిరస్మరణీయుడని పలువురు వక్తలు కొనియాడారు. పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతిని పురస్కరించుకుని లలితకళాపరిషత్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సంగీత విభావరి నిర్వహించారు. ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు, పరిషత్ ప్రధాన కార్యదర్శి పద్మజ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు ఘంటసాల పాడిన పాటలను ఆలపిస్తూ అలనాటి మధురస్మృతులను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పరిషత్ ఉపాధ్యక్షుడు రామగోవింద్‌సాగర్, అస్లాం బాషా, సురభి ఆనంద్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.
● హౌసింగ్‌బోర్డు రాజీవ్ చిల్డ్రన్స్ పార్కులోని ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి పాతపాటల ప్రేమికుల సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాయనీ గాయకులు ఘంటసాల పాటలు ఆలపిస్తూ స్వరనీరాజనం పలికారు. కార్యక్రమంలో పాతపాటల ప్రేమికుల సంఘం నాయకులు జీవి రామయ్య, ఓబుళదాస్, పాలసముద్రం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రవేశాలు కల్పిస్తే చర్యలు: ఆర్ఐఓ

అనంతపురం విద్య, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీయట్ కళాశాలల్లో ముందస్తు ప్రవేశాలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ హెచ్చరించారు. నగరంలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజ్‌లో బుధవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను, ఇతర ఫైళ్లను పరిశీలించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ ఇంటర్ బోర్డు షెడ్యూల్ విడుదల చేయకముందు ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఎవరూ ముందస్తు అడ్మిషన్లు చేపట్టకూడదన్నారు. ఎవరైనా అడ్మిషన్లు చేస్తే బోర్డు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. 2025 మార్చి పబ్లిక్ పరీక్షల ఫీజును ఈ నెలా 5లోపు చెల్లించేలా చూడాలని ఆయన ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. 2025 ఫిబ్రవరి మొదటివారంలో ఇంటర్ ప్రాక్టికల్స్ ఉంటాయని, అన్ని యాజమాన్య కళాశాలల ప్రిన్సిపాళ్లు జనవరి 31లోగా సిలబస్, ప్రయోగాలు పూర్తి చేయాలని, రికార్డులను సర్టిపై చేయాలని ఆదేశించారు.

న్యూస్‌బాక్స్

టమోటా కిలో రూ.33

అనంతపురం రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 23తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 28, కనిష్ఠ ధర రూ. 23 పలికినట్లు ఆయన తెలిపారు.

వర్షాల సమయంలో పంట కోతలు వద్దు: ఏడీఏ రవి

అనంతపురం అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వర్షాలు పడే సమయాల్లో పంట కోతలు మొదలు పెట్టవద్దని అనంతపురం ఏడీఏ రవి సూచించారు. అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి, గార్లదిన్నె మండలాల్లో పంట కోత తర్వాత తడిసిన వరి పంటను బుధవారం ఆయన పరిశీలించారు. వర్షాలు పడే సూచనలు ఉన్న సమయాల్లో వరితోపాటు ఇతర రకాల పంటను ఎట్టిపరిస్థితుల్లోనూ కోత కోయకూడదన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పంటనష్టాన్ని నివారించుకోవచ్చునన్నారు. పంట కోసిన తర్వాత దిగుబడులు తడిసిపోతే పంటనష్టపరిహారం వర్తించదన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

931 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 931 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ -2కు 837 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

క్రైంకార్నర్

యువతి ఆత్మహత్య


తనూజ (ఫైల్)

రాయదుర్గం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని పైతోట ఏరియాలో రైలు నుంచి దూకి ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా సేడం పట్టణానికి చెందిన తనూజ(20) మెడికల్ సీటు రాకపోవడంతో తీవ్రంగా మనస్తాపం చెందింది. ఈక్రమంలోనే మంగళవారం సాయంత్రం కుటుంబసభ్యులకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పింది. కుటుంబసభ్యులు ఆందోళన చెంది కర్ణాటకలోని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు ఆమె ఆచూకి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే బుధవారం ఉదయం పైతోట సమీపంలో రైల్వే గ్యాంగ్‌మెన్ నాగేష్ ఓ యువతి మృతదేహం చూసి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రైల్వేపోలీసులు ఆ యువతి వివరాల కోసం దర్యాప్తు చేపట్టగా, అది తనూజ మృతదేహంగా గుర్తించి ఆమె కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. గుంతకల్లు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

మహిళపై కత్తితో దాడి


గాయపడిన నాజియా

గుత్తి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కమటా వీధికి చెందిన నాజియా అనే వివాహితపై అదే కాలనీకి చెందిన లారీ డ్రైవర్ దాదా ఖలందర్ బుధవారం కత్తితో దాడి చేశాడు. నాజియా కూలీ పనుల కోసం బండగేరికి వెళ్తుండగా దాదాఖలందర్ కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. స్థానికులు గాయపడిన నాజియాను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

కూడేరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కూడేరు గ్రామపంచాయతీ టీడీపీ మద్దతు సర్పంచ్ లలితమ్మ బుధవారం ఉదయం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. కొద్దిసేపటి తర్వాత ఇంట్లోకి వచ్చిన భర్త ఈశ్వరయ్య ఫ్యానుకు వేలాడుతున్న ఆమెను చూసి వెంటనే కిందికి దింపాడు. తర్వాత చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి ఆందోళన కరంగా ఉందని వైద్యులు తెలిపారు. సీఐ రాజు ఇంకా ఈ విషయం తమ దృష్టికి రాలేదన్నారు. సర్పంచ్ ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

విరిగిపడిన మృత్యువు

మట్టి మిద్దె కూలి ముగ్గురి మృతి
నిర్మాణ దశలో షెడ్డు కూలి మరో ఇద్దరు
ఉమ్మడి జిల్లాలో విషాదం నింపిన ఘటనలు


మట్టిలో కూరుకుపోయిన ముగ్గురి మృతదేహాలు


కురుబ గంగన్న, కురుబ శ్రీదేవి, సంధ్య (ఫైల్ ఫొటోలు)

కుందుర్పి/చిలమత్తూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పాత మిద్దె, నిర్మాణ దశలో ఉన్న షెడ్ కూలిపోయి ఐదుగురు మృతిచెందారు. కుందుర్పి మండలంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు, చిలమత్తూరు మండలంలో ఓ రైతు, కూలీ ప్రాణాలు కోల్పోయారు. కుందుర్పి మండలం రుద్రంపల్లి గ్రామంలో మట్టిమిద్దె వరండా కూలిపోవడంతో గ్రామానికి చెందిన కురుబ గంగన్న (48), ఆయన భార్య శ్రీదేవి (40), కూతురు సంధ్య(15) మృతి చెందారు. కుటుంబ సభ్యులు అందరూ కలిసి మంగళవారం రాత్రి భోజనం చేసి, కబుర్లు చెప్పుకున్నారు. నిద్ర రావడంతో పది గంటల తరువాత వరండాలో తమ కూతురితో కలిసి దంపతులు ఇద్దరూ నిద్రకు ఉపక్రమించారు. లోపలి గదిలో (వంట గది) గంగన్న తల్లి ముత్యాలమ్మ నిద్రించారు. ఆమె బుధవారం ఉదయం నిద్రలేచి, తలుపులు తీసేసరికి వరండా మొత్తం కూలిపోయి కనిపించింది. దీంతో భయాందోళనకు గురై.. గట్టిగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వచ్చి చూశారు. శిథిలాలను తొలగించి చూసేసరికి ముగ్గురూ మృతిచెందారు. అర్ధరాత్రి, గాఢ నిద్రలో ఉన్న సమయంలో మిద్దె కూలిపోయినట్లుందని, అందుకే తెల్లవారేదాకా ఈ విషయం ఎవరికీ తెలియలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తుఫాను ప్రభావంతో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని, దీంతో మట్టిమిద్దె తడిసి కూలిపోయిందని అన్నారు. శిథిలాల కింద కూరుకుపోయి ఊపిరి ఆడక ముగ్గురూ మృతిచెందారు.

కొత్త ఇంటికి దరఖాస్తు చేసి..

మట్టి మిద్దె పాతబడటంతో పక్కా ఇంటికోసం గంగన్న దరఖాస్తు చేయాలని భావించాడు. గ్రామంలోని టీడీపీ నాయకులకు మంగళవారం రాత్రి తమ కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు, ఫొటోలు తదితరాలను ఇచ్చి వచ్చాడు. తనకు కొత్త ఇంటిని మంజూరు చేయించాలని వారికి విన్నవించాడు. కానీ తెల్లవారేలోగా ఘోరం జరిగిందని టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న కాస్త పొలంలో వ్యవసాయం చేసుకుంటూ, కూలి పనులకు వెళుతూ కష్టపడి బతికేవారని అన్నారు. వైసీపీ హయాంలో పక్కా ఇంటిని మంజూరు చేసి ఉంటే ఈ ఘోరం జరిగేది కాదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్‌చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలియగానే గ్రామానికి వెళ్లి పరిశీలించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మిగిలింది అవ్వ.. మనవడు..

గంగన్న, శ్రీదేవి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. పెద్ద కూతురు మల్లీశ్వరికి ఇటీవలే వివాహం జరిపించారు. చిన్నకూతురు సంధ్య ఎనుములదొడ్డి ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. కుమారుడు ఈశ్వర్ పదో తరగతి తరువాత చదువు మానేశాడు. కూలి పనులకు వెళుతూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేవాడు. టమోటా బాక్సులను మోసే పని ఉండటంతో మంగళవారం రాత్రి అనంతపురం టమోటా మార్కెట్‌కు వెళ్లాడు. ప్రమాదం గురించి తెలుసుకుని గ్రామానికి చేరుకుని కన్నీటిపర్యంతం అయ్యాడు. ఆ ఇంట్లో అవ్వ, మనవడు మాత్రమే ప్రాణాలతో మిగిలారు.

నారా లోకేశ్ దిగ్భ్రాంతి

మిద్దె కూలి ముగ్గురు మృతి చెందిన విషయాన్ని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మంత్రి నారా లోకేశ్ ఫోన్లో వివరించారు. దీంతో మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణ సాయం కింద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే రూ.50 వేలు అందచేశారు. ఈశ్వర్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని టీడీపీ నాయకులు తెలిపారు. టీడీపీ నాయకులు పాలబండ్ల శ్రీరాములు, ధనుంజయ, రాఘవేంద్రబాబు, మల్లికార్జున, శేఖర్‌గౌడ్, ప్రసాదు, దీనమ్మ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గంగన్న, శ్రీదేవి దంపతులు టీడీపీ సభ్యత్వం తీసుకున్నారని అన్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, తాము అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.


బాధిత కుటుంబానికి రూ.50 వేలు ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

శెట్టిపల్లిలో ఇద్దరు..


లక్ష్మీనారాయణరెడ్డి, శివారెడ్డి (ఫైల్‌ఫొటోలు)

వ్యవసాయ పనిముట్లను భద్రపరిచేందుకు నిర్మిస్తున్న షెడ్ కూలడంతో ఇద్దరు మృతిచెందారు. ఈ సంఘటన శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం శెట్టిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. శెట్టిపల్లికి చెందిన రైతు శివారెడ్డి తన పొలంలో షెడ్ నిర్మాణ పనులు చేపట్టారు. గోడలు పూర్తి కావడంతో బుధవారం పైకప్పు పనులు ప్రారంభించారు. గోడలపై ఇనుప దూలాలు వేసి, వాటిపై నాపరాళ్లను పరిచి, సిమెంట్ కాంక్రీట్ వేస్తుండగా బరువు తట్టుకోలేక ఒక్కసారిగా పైకప్పు కూలిపోయింది. దీంతో పై భాగంలో నిలబడి పనిచేస్తున్న శివారెడ్డి (65), ఆయన కుమారుడు రాజశేఖర్ రెడ్డి, కూలీ లక్ష్మీనారాయణరెడ్డి(50) తీవ్రంగా గాయపడ్డారు. అక్కడున్నవారు శకలాలను తొలగించి ముగ్గురినీ బయటకు తీశారు. అప్పటికే లక్ష్మీనారాయణరెడ్డి మృతి చెందారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో శివారెడ్డి మృతి చెందారు. రాజశేఖర్ రెడ్డిని హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్రమణ్యం తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జగన్ వద్ద పురం పంచాయితీ

ఇరువర్గాల వాదనలు విన్న అధినేత
త్వరలోనే పురానికి దూతలు
విభేదాలపై అసహనం

హిందూపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పార్టీ అధికారంలో ఉన్నా.. లేకపోయినా హిందూపురం వైసీపీలో విభేదాలు మాత్రం అలాగే ఉన్నాయి. ఏ గ్రూపు ఉన్నా ఏడాదిలో రెండు సార్లయినా ఇన్‌చార్జి పదవికోసం హిందూపురం నాయకులు అధినేత జగన్ వద్దకు పంచాయితీకి వెళ్తారు. ప్రస్తుతం కూడా అదే జరిగింది. బుధవారం తాడేపల్లిలో వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అధినేత జగన్‌ను వైసీపీ పురం ఇన్‌చార్జి దీపిక వర్గంతోపాటు ఆగ్రోస్ మాజీ చైర్మన్ నవీన్ నిశ్చల్ ఆయన వర్గంలోని ముఖ్య నాయకులు కొందరు కలిశారు.

పరస్పరం ఫిర్యాదులు

నవీన్‌నిశ్చల్, దీపిక వర్గాలకు చెందిన నాయకులు వేర్వేరుగా జగన్‌ను కలిసి పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. నవీన్ వర్గం నుంచి మున్సిపల్ తాత్కాలిక చైర్మన్ బలరాంరెడ్డి, లేపాక్షి మండల కన్వీనర్ నారాయణస్వామి, జడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, శెట్టిపల్లి ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డి, లేపాక్షి సర్పంచ్ ఆదినారాయణ నవీన్‌తోపాటు కలిశారు. దీపికపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఎన్నికల అనంతరం ఇన్‌చార్జి దీపిక.. కార్యకర్తలకు అందుబాటులో ఉండట్లేదనీ, ఏదైనా సమస్య వస్తే ఫోన్‌లో సైతం స్పందించరని చెప్పినట్లు తెలిసింది. ఇన్‌చార్జి వద్ద ఉన్న ఒకరిద్దరు చెప్పినట్లు వారు వ్యవహరిస్తున్నారనీ, దీంతో పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న తమ పరిస్థితి ఏంటని వాపోయినట్లు తెలిసింది. వారంలో ఒకట్రెండు రోజులు కూడా హిందూపురంలో అందుబాటులో ఉండరనీ, అలాంటివారు ఇన్‌చార్జిగా ఉంటే పార్టీ నాశనం అవుతుందని చెప్పినట్లు సమాచారం.

నవీన్‌పై చర్యలు తీసుకోవాలి

జగన్‌ను పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీతోపాటు ఇన్‌చార్జి దీపిక, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, కౌన్సిలర్ శివ, మరికొంతమంది నాయకులు కలిశారు. వారు మాట్లాడుతూ.. నవీన్‌నిశ్చల్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనీ, ఎన్నికల అనంతరం పార్టీ కార్యక్రమాలు అంతంత మాత్రంగా చేస్తున్నారని జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇన్‌చార్జి ప్రమేయం లేకుండా మండల కన్వీనర్లను ఎంపిక చేస్తున్నట్లు, ఇటీవల నవీన్‌నిశ్చల్ కార్యాలయంలో లేపాక్షి నాయకులు సమావేశం అయిన ఫొటోలను జగన్‌కు చూపించినట్లు తెలిసింది. ఇన్‌చార్జి అనే గౌరవం నవీన్ వర్గీయులకు ఏమాత్రం లేదనీ, ఫలితంగా పార్టీలో క్రమశిక్షణ తప్పుతుందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరినట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల హిందూపురంలో నవీన్‌నిశ్చల్ వేసిన ఫ్లెక్సీల్లో పార్టీకి సంబంధించిన బొమ్మలు లేవని చెప్పినట్లు తెలిసింది.

అధినేత అసహనం

రెండువర్గాల నాయకుల వాదనలు విన్న జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నా.. లేకున్నా.. హిందూపురంలో వర్గపోరు ఉండటం ఏంటని అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీ కార్యక్రమాలు చేయకుండా పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడం సబబుకాదని అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. అందరూ కలిసి తన వద్దకు రావాలే తప్ప.. ఇలా ఫిర్యాదులు చేయడానికి రాకూడదని పేర్కొన్నట్లు సమాచారం. హిందూపురం వైసీపీలో నెలకొన్న వర్గవిభేదాలను చక్కదిద్ది ఏకనాయకత్వం చేసేందుకు సజ్జలగానీ, మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలోగానీ దూతలను హిందూపురానికి పంపనున్నట్లు జగన్.. రెండువర్గాలకు చెప్పినట్లు సమాచారం. త్వరలోనే హిందూపురానికి దూతలు రానున్నారు. జగన్‌ను కలిసేందుకు నవీన్‌కు సజ్జల, దీపిక వర్గానికి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీ అవకాశం ఇప్పించినట్లు తెలిసింది.

ముగ్గురు దొంగల అరెస్ట్

పది ద్విచక్రవాహనాలు, పది తులాల బంగారు ఆభరణాల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాల వద్ద డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు

గుంతకల్లుటౌన్,డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చోరీలు, ద్విచక్రవాహనాలు దొంగతనం చేసిన ముగ్గురిని కసాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక కసాపురం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సాయంత్రం డీఎస్పీ ఎ.శ్రీనివాస్ అరెస్ట్ వివరాలను వెల్లడించారు. పట్టణంలోని ఉమామహేశ్వరనగర్‌కు చెందిన బి. వంశీ, మండలంలోని నెలగొండ గ్రామానికి చెందిన సుదికుంట హేమంత్‌కుమార్ కసాపురం, గుంతకల్లు వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాలు దొంగిలించారు. వచ్చిన సమాచారం మేరకు మధ్యాహ్నం వీరిని పక్కీరప్ప కాలనీలోని శివాలయం వద్ద కసాపురం ఎస్ఐ వెంకటస్వామి తన సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారి నుంచి 9 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే ఉమామహేశ్వర్ నగర్‌కు చెందిన షేక్షావలి, అతడి సోదరుడు మస్తాన్ గుంతకల్లు వన్‌టౌన్, కసాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇళ్లలో దొంగతనాలు చేశారు. షేక్షావలిని డీఆర్ఎం కార్యాలయం సమీపంలోని భవానీ గుడి వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి నుంచి పది తులాల బంగారు ఆభరణాలు, దొంగతనానికి ఉపయోగించిన పల్సర్ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. మస్తాన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ వెంకటస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టారాజ్యానికి ఇక చెల్లు..!

- సచివాలయంలో సిబ్బంది ఉండాల్సిందే
- ఉదయం, సాయంత్రం ముఖహాజరు తప్పనిసరి
- ఒకపూట హాజరు వేస్తే సెలవు కింద లెక్కే
- విధులకు డుమ్మాకొట్టే వారి ఆటలకు ఇక చెక్



ధర్మవరంలోని వార్డు సచివాలయం

ధర్మవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇకపై సచివాలయాల్లో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి వీలులేదు. సచివాలయాల్లో కొందరు ఉద్యోగులు ఇష్టం వచ్చినప్పుడు వచ్చి... ఇష్టం వచ్చినప్పుడు వెళ్లేవారు. ప్రజలకు సరిగా అందుబాటులో ఉండేవారు కాదు. దీంతో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గమనించిన కూటమి ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ఆ కార్యాలయంలోనే ఉండేలా చర్యలు తీసుకుంది. రెండు పూటలా సచివాలయాల్లో ముఖహాజరు వేసేలా చర్యలు తీసుకుంది.

హాజరు తప్పనిసరి

సచివాలయ ఉద్యోగులకు ముఖహాజరు తప్పనిసరి చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎప్పటి నుంచో ఈ హాజరు పద్ధతి అమల్లో ఉన్నా ఎవరూ పట్టించుకునేవారు కాదు. రోజులో ఏదో ఓ పూట యాప్‌లో హాజరు వేసుకొని.. వెళ్లిపోయేవారు. కానీ ఇప్పుడు ఆ విధానానికి కూటమి ప్రభుత్వం స్వస్తి చెప్పింది. ప్రతి ఉద్యోగి రోజూ రెండు పూటలా యాప్‌లో హాజరు వేసుకోవాల్సిందే. ప్రభుత్వ పనివేళలు ఉదయం 10గంటలకు కచ్చితంగా సచివాలయానికి చేరుకుని హాజరు వేయాలి. ఆ తరువాత సాయంత్రం 5గంటలకు యాప్‌లో హాజరు వేసుకున్న తరువాత తిరిగి వెళ్లాలి. ఈ హాజరు కూడా సచివాలయం ఉన్న కో ఆర్డినేట్స్‌కు 500 మీటర్లలోపే వేయాలి. ఎక్కడో కూర్చోని హాజరు వేసుకుందాములే అంటే వీలు కాదు. రెండు పూటలా హాజరు వేసుకుంటేనే ఆ ఉద్యోగి ఆ రోజు విధులకు హాజరైనట్టు పరిగణిస్తారు. ఇప్పటివరకూ రోజులో ఒక పూట హాజరు వేసి సచివాలయ సిబ్బంది వెళ్లిపోయే వారు. కొందరు విధులకు డుమ్మాకొట్టేవారు. పనివేళల్లో సచివాలయాల్లో ఉండేవారు కాదు.

సిబ్బంది నిర్లక్ష్యం

జిల్లాలో 544 వార్డులు, గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 4517 మంది ఉద్యోగులున్నారు. ఒక్కో సచివాలయంలో సరాసరి పది విభాగాలకు చెందిన ఉద్యోగులు ఉంటున్నారు. ప్రజలకు ఏ పని జరగాలన్నా ముందు సచివాలయానికే వెళ్లాల్సి వస్తోంది. అయితే అక్కడి సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేస్తుండటం, వేళాపాళా లేకుండా విధులకు వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. చిన్న పనికి కూడా సామాన్యులు రెండు, మూడు సార్లు సచివాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేంది. మండల స్థాయి అధికారులకు కూడా ఇది సమస్యగా మారింది. సమయపాలన పాటించని ఉద్యోగులకు నోటీసులు ఇస్తున్నా వారిలో మార్పురాలేదు. కొందరి నిర్లక్ష్యం వల్ల మొత్తం సచివాలయ వ్యవస్థే అభాసుపాలుఅవుతోంది. సచివాలయ సిబ్బంది పనితీరుపై ఇటీవల ఉన్నతాధికారులకు వరుసగా ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ప్రభుత్వం సచివాలయాల పనితీరుపై దృష్టి పెట్టింది. అక్కడి సిబ్బంది ఆ కార్యాలయం తప్పకుండా ఉండేలా చర్యలు తీసుకొంది.

అమల్లో ముఖహాజరు

ఈ నెల 1న సోమవారం నుంచే రెండు పూటలా యాప్‌లో ముఖ హాజరు పద్ధతిని అనుసరించాలని జిల్లా ఉన్నతాధికారులు టెలీకాన్ఫరెన్స్ ద్వారా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మరి ఇప్పటికైనా ఆ సిబ్బంది.. కార్యాలయంలో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారా.. లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజా సమస్యలు పరిష్కరించి.. సుపరిపాలన అందించడానికే సచివాలయాల్లో రెండు పూటలా ముఖహాజరు పద్ధతిని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇదివరకు బయోమెట్రిక్ పద్ధతి ఉండేది. రోజులో ఏదో ఒక సారి హాజరు వేసుకొని వెళ్లిపోయేవారు. ప్రస్తుతం సచివాలయాల్లో ముఖహాజరు తప్పనిసరి అని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

-సుధాకర్‌రెడ్డి, డీఎల్‌డీఓ

వ్యవసాయ నిర్మాణాలకు రాయితీ

కలెక్షన్ సెంటర్, కోల్డ్ రూమ్స్ ఏర్పాటుకు వర్తింపు

అనంతపురం అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూమ్‌ల ఏర్పాటు కోసం ప్రభుత్వం రాయితీని కల్పించినట్లు ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యాన పంటలు, కూరగాయలు సాగు చేసే రైతులకు మార్కెట్ చేసుకునేందుకు అనువుగా గ్రేడింగ్, ప్యాకింగ్ చేసి ఎగుమతి చేసుకునేందుకు కావాల్సిన కలెక్షన్ సెంటర్స్‌ను 40 శాతం రాయితీపై మంజూరు చేస్తారన్నారు. ఉద్యాన పంటలు, కూరగాయలు కోత కోసిన తర్వాత నేరుగా లారీలు, ట్రాక్టర్ల ద్వారా లోడ్ చేసి అన్ని రకాల సైజు కాయలను ఒకే ధరకు విక్రయించడం ద్వారా రైతులు నష్టపోతున్నారన్నారు. కలెక్షన్ సెంటర్‌లను రైతులు ఏర్పాటు చేసుకొని, పంట కోసిన తర్వాత గ్రేడింగ్ చేయడంతోపాటు అట్టపెట్టెల్లో ప్యాక్ చేసుకొని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసుకుంటే అధిక ధరను పొందవచ్చునన్నారు. కలెక్షన్ సెంటర్లను 40 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు, 15 అడుగుల ఎత్తు కొలతలతో నిర్మించుకోవాలన్నారు ట్రాక్టర్, చిన్న సైజు ఆటోలు కలెక్షన్ సెంటర్‌లోకి వచ్చివెళ్లేందుకు వీలుగా రెండు వైపులా షట్టర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆరు కిటికీలు ఉండేలా చూసుకోవాలన్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత కలెక్షన్ సెంటర్‌లో గ్రేడింగ్ టేబుల్, ప్లాస్టిక్ క్రేట్లు, వేయింగ్‌మిషన్, ఇన్వర్టర్, టేబుళ్లు, కుర్చీలు తదితర వాటిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇందు కోసం రూ.15 లక్షల ఖర్చు అవుతుందని, ఇందులో 40 శాతం సబ్సిడీ వర్తింపజేస్తారన్నారు. కోల్డ్ రూం ఏర్పాటు కోసం 35 శాతం రాయితీ వర్తింపజేస్తారని తెలిపారు. 10 టన్నుల కెపాసిటీ కలిగిన సోలార్ కోల్డ్ రూం ఏర్పాటు కోసం రూ.12.50 లక్షలు ఖర్చు అవుతుందని, ఇందులో 35 శాతం రాయితీ ఇస్తామన్నారు. ఈ కోల్డ్ రూంలో ఉద్యాన పంటలు, పచ్చళ్లు, పొడులు, పూలు తదితర వాటిని నిల్వ చేసుకోవచ్చని తెలిపారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించండి

అనంతపురం అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రబీ సీజన్‌లో మామిడి, టమోటా పంటలకు వాతావరణ ఆధారిత పంటల బీమా కోసం రైతులు ప్రీమియం చెల్లించాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ద్వారా వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల పంటనష్టం జరిగితే రైతులను ఆదుకునేందుకు వాతావరణ ఆధారిత బీమాను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. మామిడికి ఎకరాకు రూ.1650 ప్రీమియం చెల్లిస్తే రూ.33వేలు పంటల బీమా వర్తింపజేస్తారన్నారు. టమోటా ఎకరాకు రూ.1600 చెల్లిస్తే రూ.32వేలు ప్రీమియం వర్తిస్తుందన్నారు. ఈనెల 15లోపు రైతులు ప్రీమియం చెల్లించాలని తెలిపారు. బ్యాంక్ లేదా కామన్ సర్వీస్ సెంటర్, మీసేవా, బీమా కంపెనీ నియమించిన మధ్యవర్తుల ద్వారా ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులు నేరుగా పీఎంఎఫ్‌బీవై పోర్టల్ బీమాలో మొబైల్ నుంచి కూడా ప్రీమియం చెల్లించవచ్చునన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

బుక్కపట్నం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాఉత్సవ్ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు ఈనెల 7వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని స్థానిక డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో 9 నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు చదువుతున్న వారు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. నృత్యం, సంగీతం, చిత్రలేఖనం తదితర ఆరు అంశాల్లో ఈనెల 9న బుక్కపట్నంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులను, రాష్ట్రస్థాయికి పంపుతామన్నారు. వివరాలకు 9440944737 నంబరులో సంప్రదించాలని కోరారు.

న్యూస్ బాక్స్

పట్టణ పరిశుభ్రతే ముఖ్యం



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, బీజేపీ నాయకులు

ధర్మవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ధర్మవరం పట్టణ పరిశుభ్రతే ముఖ్యమని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు అన్నారు. పట్టణంలోని కాలేజ్ సర్కిల్‌లో విగ్రహాలను, పాఠశాల క్రీడామైదానంలో మరుగుదొడ్ల పరిస్థితిని బుధవారం వారు పరిశీలించారు. విగ్రహాల చుట్టూ పాడైన గ్రిల్స్‌ను మరమ్మతు చేయడంతోపాటు మరుగుదొడ్ల పనితీరు గురించి ఆరా తీశారు. పట్టణ పరిశుభ్రత చాలా అవసరమని వీటికి ప్రత్యేక చర్యలుతీసుకోవాలని ఆదేశించారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన సామకోటి



మంత్రి లోకేశ్‌తో సామకోటి ఆదినారాయణ

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారాలోకేశ్‌ను టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఆయన మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లి క్యాంపుకార్యాయలంలో కలసి కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల కాలంలోనే సంక్షేమం అభివృద్ధిలో దూసుకుపోతోందని నారాలోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. సత్యసాయిబాబా దర్శనార్థం పుట్టపర్తికి విచ్చేయాలని కోరామని సామకోటి తెలిపారు.

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



విద్యార్థులతో టీసీఎస్ టోస్టుమాస్టర్ వెంకట్రామ్

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నతశిఖరాలను అధిరోహించాలంటే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని టీసీఎస్ టోస్టుమాస్టర్ వెంకట్రామ్ సూచించారు. బుధవారం స్థానిక బీడుపల్లి సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫెస్ట్ కాటలిస్ట్-2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట్రామ్ వ్యాపార నిర్వహణ, వ్యవస్థాపకత, సృజనాత్మకతలో వివిధ భావనలు పోకడలు అన్వేషించే మార్గంలో ఆలోచనలు రేకెత్తించే అంశాలకు సంబంధించి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విజయాలు సాధించడానికి పట్టుదలతో ఉండాలన్నారు. అనంతరం క్యాంపస్‌లో వివిధ కార్యకలాపాలలో,తమనైపుణ్యాలను ప్రదర్శించిన అనంతపురం, హిందూపురం, ధర్మవరం, కదిరి, కొత్తచెరువు, పుట్టపర్తి విద్యార్థులకు బహుమతులను అందచేశారు. సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ బాలకోటేశ్వరి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ధర్మవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లీషుమీడియం పాఠశాల విద్యార్థులు రోడ్డు భద్రతా నిబంధనల గురించి బుధవారం అవగాహన కల్పించారు. విద్యార్థులతో దృశ్యాత్మక కార్యక్రమం చేపట్టారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ శెట్టిపి నిర్మలా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ రోడ్డుపై నడిచేటప్పుడు, వాహనాలు నడిపేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెంట్ తప్పక ధరించాలన్నారు. పాఠశాల డైరెక్టర్‌లు శెట్టిపి సూర్యప్రకాశ్‌రెడ్డి, శెట్టిపి పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసిన ముస్లింలు

ధర్మవరం,డిసెంబరు(ఆంధ్రజ్యోతి): ధర్మవరం నియోజకవర్గానికి చెందిన ముస్లింలు బుధవారం రాత్రి వెంకటాపురంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత, నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్‌లను కలిశారు. ముస్లింలు వారి సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ప్రధానంగా ఖబరస్తాన్, తదితర సమస్యలను పరిష్కారించాలని కోరారు. పరిటాలసునీత, శ్రీరామ్ కూడా సానుకూలంగా స్పందించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తామని తెలిపారు.

విద్యుత్ సమస్య పరిష్కారం

ముదిగుబ్బ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్ల అనంతపురం సబ్‌స్టేషన్ సమీపంలో జొన్నల కొత్తపల్లి, ఉప్పలపాడు పంచాయతీలలో లో-ఓల్టేజ్ సమస్య, విద్యుత్ అంతరాయం తరచూ ఏర్పడుతుండటంతో సమస్యను పరిష్కరించినట్టు కదిరి ఏడీ ఉదయ్‌కుమార్ తెలిపారు. రాళ్లఅనంతపురం, ఉప్పలపాడుగ్రామాలకు వేరువేరు బ్రేకర్లు సబ్‌స్టేషన్‌లో ఏర్పాటుచేయడంతో దాదాపు 15 గ్రామాలకు లో-ఓల్టేజ్ సమస్య పరిష్కరించినట్టు తెలిపారు.

చట్టాలపై అవగాహన

తనకల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో బుధవారం విద్యార్థులకు చట్టాలపై పోలీసులు అవగాహన కల్పించారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, పోక్సో బాల్యవివాహాలు, మహిళల అక్రమ ర వాణా తదితర చట్టాలపై వివరించారు. ఏమైనా సమస్యలుంటే నేరుగా పోలీసులను సంప్రదించాలన్నారు. ఎస్‌ఐ గోపి, హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ బియ్యం పట్టివేత

ముదిగుబ్బ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప ట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పట్టుకున్నట్టు ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామరావు తె లిపారు. తనిఖీల్లో భాగంగా పట్నం ఎస్‌ఐ రాజశేఖర్ సిబ్బంది తో వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రెండు క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం: పీడీ

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని సున్నంపల్లి, దాదిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. చిన్నరులు, గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీపై ఆరాతీశారు. అనంతరం చిన్నారులతో ముచ్చటించి, వారినుంచి గేయాలు, పదాలు చెప్పించారు. ఆమెతోపాటు సూపర్‌వైజర్ విజయకుమారి ఉన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

కదిరి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రెడిశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తలుపులమండలంలో 11 పంచాయతీలోని సచివాలయాల్లో ఉదయం 9నుంచి 5 గంటల వరకు గ్రామసభలు ఉంటాయన్నారు. 6న ఓబులరెడ్డిపల్లి, 10 పెద్దన్నవారిపల్లి, 11న వేపమానుపేట, 17 కుర్లి, 19 లక్కసముద్రం, 24 తలుపుల, 26 నూతన కాలువ, 27 బండ్లపల్లి, 31 ఓదులపల్లి, జనవరి 2న ఉడమలకుర్తి, 4న పులిగిండ్లపల్లిలో సదస్సులు నిర్వహిస్తామన్నారు.

ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు..!

● ముదిగుబ్బ స్టేషన్‌లో ఆగేది ఒక్కటే
● పట్టణాలకు వెళ్లాలంటే రెండు రైళ్లు మారాల్సిందే
● విద్యార్థులకు తప్పని అగచాట్లు



ముదిగుబ్బ రైల్వే స్టేషన్

ముదిగుబ్బ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలోని గుంతకల్లు డివిజన్‌లో ధర్మవరం జంక్షన్ నుంచి ముదిగుబ్బ మీదుగా ఏడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే పెద్ద మండలంగా పేరొందిన ముదిగుబ్బ అప్పట్లో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేసి మీటర్ గేజ్‌మీద రైళ్లు నడిపేవారు. మారుతున్న కాలానుగుణంగా బ్రాడ్‌గేజ్ నిర్మాణం విద్యుత్ లైన్లు ఏర్పాటు పనులు జరిగాయి. ప్రతిరోజు ప్యాసింజర్ రైళ్లు గుంతకల్లు నుంచి తిరుపతికి వెళ్తున్నాయి, బ్రాడ్‌గేజ్ అయిన తరువాత దాదాపు ఏడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ముదిగుబ్బమీదుగా నడుస్తున్నాయి. వాటిలో ఒకటి ప్రతిరోజు నరసాపురం నుంచి ధర్మవరానికి నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు మాత్రమే ఇక్కడ ఆగుతుంది. మిగతా ఆరు రైళ్లలో ఒకటి పద్మావతి ఎక్స్‌ప్రెస్, కాచిగూడ నుంచి తిరుపతికి వెళ్లేటప్పుడు ముదిగుబ్బలో స్టాపింగ్‌లేదు. అయితే తిరుమతి నుంచి కాచిగూడకు వెళ్లే టప్పుడు ఆగుతుంది. అంకోలా ఎక్స్‌ప్రెస్ వారంలో ఒక రోజు, పద్మావతి ఎక్స్‌ప్రెస్ వారంలో రెండు రోజులు, నాగర్ కోయిల్-ముంబాయ్ ఎక్స్‌ప్రెస్ వారంలో నాలుగు రోజులు, అమరావతి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ వారంలో రెండు రోజులు, సెవన్ హిల్స్ ఎక్స్‌ప్రెస్ వారంలో రెండు రోజులు, కాచిగూడ నుంచి మధురైకి వెళ్లే ఎక్స్‌ప్రెస్ వారంలో ఒకరోజు ముదిగుబ్బ మీదుగా నడుస్తున్నాయి. ఎక్స్‌ప్రెస్ రైళ్లు ముదిగుబ్బలో ఆపడానికి గత వైసీపీ ప్రభుత్వంలో ఎంపీలకు ఎన్నోసార్లు వినతిపత్రం అందజేసినా ముదిగుబ్బలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపేవిధంగా చర్యలుచేపట్టలేదు. మండలంలోనే కాకుండా కడప, పులివెందుల నుంచి పుట్టపర్తి నియోజకవర్గం ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ప్రతి రోజు వందలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు ముదిగుబ్బకు వచ్చి రైల్లో ప్రయాణం చేస్తుంటారు. కదిరి లేక ధర్మవరానికి వెళ్లి రైలు ఎక్కే పరిస్థితి నెలకొందని ప్రయాణికులు వాపోతున్నారు. పెద్ద మండలమైన ముదిగుబ్బ నుంచి పుణ్యక్షేత్రాలైన తిరుపతి, మదురై, అరుణాచలం, హైదరాబాద్ తదితర దూరప్రాంతాలకునిత్యం వెళ్తుంటారు. కడప, అనంతపురం, సత్యసాయి జిల్లాల నుంచి విద్యార్థులు విజయవాడ, మధురై, చెన్నై, హైదరాబాద్, తిరుపతికి వివిధ కళాశాలల్లో చదువుకోవడానికి ఇక్కడి నుంచి వెళ్తుంటారు. ఇంటి నుంచి కళాశాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులుపడుతున్నట్లు వారు వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముదిగుబ్బలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి

పిల్లలు దూర ప్రాంతాలలో చదువుకుంటున్నారు. ముదిగుబ్బ మీదుగా ఏడు ఎక్స్‌ప్రెస్‌రైళ్లు వెళ్తున్నాయి. చెన్నైకి వెళ్లాలంటే రెండు రైళ్లు మారాల్సి వస్తోంది. పిల్లలను దగ్గరుండి వదిలిరావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అధికారులు స్పందించి రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలి.

-పసుపులేటి వెంకటేశ్, ముదిగుబ్బ

నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు వేళలు మార్చాలి

ధర్మవరం నుంచి నరసాపురానికి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు విజయవాడకు 2 గంటలకు చేరుకుంటుంది. కళాశాలలకు వెళ్లాలంటే స్టేషన్‌లో తెల్లవారే వరకు పడిగాపులు కాయాల్సివస్తోంది. సాయంత్రం 5 గంటలకు బయలుదేరితే తెల్లవారిన తరువాత ఆ రైలు వెళ్తుంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి

- ఉమేశ్, బీటెక్ విద్యార్థి

మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



విద్యార్థులతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మహిళా సమస్యల పరిష్కారానికి ఈ కేంద్రం ద్వారా కృషి చేయాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. బుధవారం తలుపుల మండలం కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో జెండర్ రీసోర్స్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెంటర్ ద్వారా మహిళల సమస్యలు పరిష్కరించి మంచి తీసుకురావాలన్నారు. కేవలం పేరుకే అన్నట్లుగా ఉండకూడదన్నారు. వెలుగు ద్వారా అనేక పథకాలు మహిళలకు ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమల్లో భాగంగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇతర పథకాలు అమలు అవుతాయని అన్నారు. ఎంపీడీఓ రామానాయక్, వెలుగు ఏపీ వెంకటనారాయణ ప్రసంగించారు. కార్యక్రమంలో తలుపుల ఏపీఎం బాజ్జి, ఇతర సిబ్బందిపాల్గొన్నారు. అనంతరం జడ్పీ పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే పాఠశాలకు కావాల్సిన టేబుల్స్ క్రీడా సామగ్రి అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులతో కరచాలం చేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు.

సభ్యత్వ నమోదులో కదిరి ప్రథమం: టీడీపీ సభ్యత్వనమోదులో కదిరి నియోజకవర్గం ప్రథమస్థానంలో ఉందని హిందూపురం పార్లమెంటు అధ్యక్షుడు కోళ్లకుంట ఆంజనప్ప అన్నారు. బుధవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నివాసంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ హిందూపురం పార్లమెంట్‌లో కదిరి నియోజకవర్గం సభ్యత్వనమోదులో ప్రథమస్థానంలో ఉందన్నారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. సభ్యత్వనమోదుకు పనిచేసిన నాయకులు, కార్యకర్తలను ఆయన అభినందించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, కన్వీనర్లు రాజశేఖర్, రెడ్డిశేఖర్, నాయకులు ఆంజనప్పనాయుడు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతిపై విచారణ చేపట్టాలి

ఓబుళదేవరచెరువు, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం పంచాయతీలో ఉపాధి పథకంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరుతూ బుధవారం సీనియర్ సహాయకులు పద్మనాభరెడ్డికి టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఫిర్యాదు చేశారు. నాయకుడు ఇద్దె ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వెంకటాపురం పంచాయతీలో కొన్నిచోట్ల పనులు చేయకపోయినా చేసినట్లు రికార్డులు పొందుపరిచారన్నారు. వీటితోపాటు పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిన వారి పేర్లతో డబ్బులు దండుకుంటున్నట్లు ఆరోపించారు. వీటిపై విచారించి న్యాయం చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బాధితుడికి ఆర్థికసాయం చేస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరంరూరల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్శినమల గ్రామంలో ఒంటరి మహిళ అంకే కుమారి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ స్పందించి స్థానిక టీడీపీ నాయకులు ద్వారా ఆసుపత్రిలో ఉన్న బాధితకుటుంబ సభ్యులతో ఫోన్‌లో పరామర్శించి రూ.20వేలు ఆర్థికసాయం అందించారు. మృతురాలి కుమారులను చదివించేందుకు ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా పిల్లల చదువులకు కృషి చేస్తారని వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహేష్‌చౌదరి, విజయసారథి, రాఘవరెడ్డి, జంగంనరసింహులు, విజయచౌదరి, భాస్కర్‌చౌదరి, కొండారెడ్డి తదితరులు ఉన్నారు.

నివాస ప్రాంతాల్లో మద్యం షాపు వద్దు



రాస్తారోకో చేస్తున్న మహిళలు

బత్తలపల్లి డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తాడిపత్రి రోడ్డులో మద్యంషాపు వద్దంటూ బుధవారం సాయంత్రం మహిళలు రోడ్డుపై ధర్నా చేపట్టారు. బత్తలపల్లికి మూడు మద్యం షాపులు మంజూరు అయ్యాయని, మొదట కదిరి రోడ్డులో ఒకటి, ధర్మవరం రోడ్డులో మరొకటి ఏర్పాటు చేశారన్నారు. నిబంధనల ప్రకారం హైవేకు 200 మీటర్ల సమీపంలో మద్యం షాపులు ఉండకూడదని, రెండు షాపులు మార్చారు. మూడో షాపు పాతవూరు తాడిపత్రి రోడ్డులోని ప్రధాన రహదారిలో ఏర్పాటు చేశారు. కొంత మంది మహిళలు నివాస గృహల మధ్య మద్యం వద్దు అంటూ తాడిపత్రి రోడ్డుపై ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సోమశేఖర్ సిబందితో అక్కడకు చేరుకుని రోడ్డుపై ధర్నా చేయడం సరికాదని వారిని పక్కకు పంపించారు.

నేటి నుంచి ఆధార్ సెంటర్లు

కదిరి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు విద్యార్థుల సౌకర్యార్థం బాలికల ఉన్నతపాఠశాలలో 5 నుంచి 9వ తేదీ వరకు పది సెంటర్లు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషన్ కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ సెంటర్లు ఉంటాయన్నారు. ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకునే విద్యార్థులు వారి పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తోపాటు, తల్లి లేదా తండ్రి ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు.

11న యూటీఎఫ్ నిరసన



డీఈఓకు నోటీసు అందిస్తున్న శెట్టిపి జయచంద్రారెడ్డి, నాయకులు

ధర్మవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి 11వ తేదీన నిరసన ప్రదర్శన చేపట్టినట్లు యూటీఎఫ్ సత్యసాయి జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్ తెలిపారు. ఇందుకు సంబంధించి బుధవారం డీఈఓకు షోకాజ్ నోటీసు అందజేసినట్లు తెలిపారు. వారు మాట్లాడుతూ యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి 11న డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వ పరిపాలనకు, ఈ ప్రభుత్వ పరిపాలనకు పెద్దగా తేడా లేదనే విధంగా విద్యాశాఖ అధికారుల నిర్ణయాలు ఉంటున్నాయని ఆరోపించారు. అపార్ నమోదు విషయంలో ఉపాధ్యాయులు పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనివల్ల బోధనకు ఆటంకం కలుగుతోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 100 రోజుల యాక్షన్‌ప్లాన్‌లో ఆదివారాలు, పండుగ దినాల్లో పనిచేయాలంటూ ఇచ్చిన ఉత్తర్వులపట్ల ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సలర్ మేరివరకుమారి, జిల్లా కార్యదర్శి లతాదేవి, నాయకులు రామకృష్ణనాయక్, హరికృష్ణ, లక్ష్మయ్య, రాంప్రసాద్, రామాంజనేయులు, సాయిగణేశ్, బిల్లే రామాంజనేయులు, హరిశంకర్, వెంకటకిశోర్, బాలగొండ్ల ఆంజనేయులు, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సంక్షేమనిధి ఏర్పాటు చేయాలి

కదిరి అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికులకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ ఓబులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని లేబర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రద్దుచేసిన బీడీ కార్మికుల సంక్షేమ చట్టాలు పునరుద్ధరించాలన్నారు. బీడీ నుంచి వసూలు చేసే జీఎస్టీ నుంచి కార్మికుల సంక్షేమంకోసం నిధులు కేటాయించాలన్నారు. కదిరి పట్టణంలో ఐదువేలమంది బీడీ కార్మికులున్నారని, వీరిలో 99 శాతం ముస్లింలు ఉన్నారన్నారు. ఏళ్ల తరబడి బీడీలు చుడుతూ శ్వాసకోస, ఆస్మా, కంటిచూపు దెబ్బతినడం లాంటి అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కదిరి పట్టణంలో బీడీ కార్మికులకు ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలన్నారు. కార్మికుల పిల్లలకు కేంద్రం ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌లు పెంచాలన్నారు. ఇళ్లులేని కార్మిలకు పక్కాగృహాలు కట్టించాలని, 60 ఏళ్లు దాటిన కార్మికులకు రూ.5వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. వారికి సంక్షేమ నిధి ఏర్పాటుచేసి ఆదుకోవాలన్నారు. సీఐటీయూ నాయకులు నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్, రామమోహన్, మున్నీ, సుమియా, వహీదా పాల్గొన్నారు.



కార్మికశాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బీడీ కార్మికులు

సభ్యత్వ నమోదులో పురానికి అగ్రస్థానం

● వెంకటాపురంలో టీడీపీ నాయకుల సంబరాలు



హిందూపురం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడికి కేక్‌ను తినిపిస్తున్న ఎమ్మెల్యే

రామగిరి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. వెంకటాపురంలో బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. జోన్-5 పరిధిలో 3.80 లక్షలకు పైగా సభ్యత్వనమోదు చేయించి రికార్డు సృష్టించామన్నారు. కేక్‌నుకట్ చేసి టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు అంజినప్పకు తినిపించి, సన్మానించారు. అంజినప్ప మాట్లాడుతూ...హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొట్టమొదటిసారిగా పరిటాల సునీత వద్ద నుంచే సభ్యత్వ నమోదును ప్రారంభించామన్నారు. సంబరాలు కూడా ఇక్కడే చేశామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో రాప్తాడు నియోజకర్గం రాష్ట్రంలో 14వ స్థానం, పార్లమెంట్ పరిధిలో మూడో స్థానంలో ఉందన్నారు. త్వరలోనే అగ్రస్థానం చేరుకుంటామన్నారు. రెండు మండలాల్లో సభ్యత్వనమోదు తక్కువగా ఉందని వారు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గం కూడా రాష్ట్రంలో 14వ స్థానం, పార్లమెంట్‌లో మూడో స్థానంలో ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషివల్లే ఇది సాధ్యమైందన్నారు. టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, నాయకులు రామ్మూర్తినాయుడు, కమతం కాటమయ్య, చింతలపల్లి మహేశ్, పరిశే సుధాకర్ పాల్గొన్నారు.

పథకాల అమలుకు సమగ్ర డేటా అవసరం



మాట్లాడుతున్న మెప్మా పీడీ విశ్వజ్యోతి

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణపేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయసంఘాలు, స్లమ్‌సమాఖ్యల పటిష్టతకు ఆయా సంఘాల సమగ్రడేటా అవసరమని మెప్మా పీడీ విశ్వజ్యోతి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని మెప్మాకార్యాలయంలో నిర్వహించిన స్వయంసహాయక సంఘాల ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ మొబైల్‌యాప్ డేటా ఎంట్రీ, స్వయం సంఘాలకు ప్రభుత్వ పథకాల అమలుపై నిర్వహించిన ఒకరోజు శిక్షణ సమావేశానికి ముఖ్యఅతిథిగా పీడీ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ నవంబరు 1 నుంచి 3 వరకు మెప్మామిషన్ డైరక్టర్ ఆదేశాల మేరకు స్వయం సంఘాలు, స్లమ్‌సమాఖ్యల పటిష్టత కొరకు పూర్తి డేటాను అన్‌లైన్ చేశామన్నారు. దీనివల్ల సంఘాలకు, సమాఖ్యలకు ప్రభుత్వ పథకాల అమలును పటిష్ఠం చేయడానికి వీలు కలుగుతుందన్నారు. సమావేశంలో మెప్మా ఐబీ భవానీ, బీఎల్ కాటమయ్య,డీఎంసీ శ్రీనివాసరెడ్డి, మెప్మాటౌన్‌మిషన్‌కోఆర్డినేటర్ రమాదేవి, స్వయం సంఘాల సమాఖ్య కార్యదర్శి పద్మ, కమ్యూనిటీ ఆర్గనైజర్లు దాదాపీర్, ఆర్పీలు పాల్గొన్నారు.

జనసేన పార్టీలోకి 100 కుటుంబాల చేరిక



జనసేన పార్టీలోకి చేరుతున్న కుటుంబాలు

ధర్మవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సమక్షంలో బుధవారం పట్టణంలోని 40వ వార్డుకు చెందిన 100 కుటుంబాలు ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. 40వ వార్డు ఇన్‌చార్జి వెంకటప్ప ఆధ్వర్యంలో తారకరామాపురానికి చెందిన 100 కుటుంబాలసభ్యులకు మధుసూదన్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి జనసేనలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి పార్టీలోకి చేరామన్నారు. ఏ కార్యకర్త ఆపదలో ఉన్నా వారికి అండగా ఉంటానని చిలకం మధు తెలిపారు. జనసేన కార్యనిర్వాహణ కమిటీ సభ్యులు కడపల సుధాకర్‌రెడ్డి, మిరియాల లక్ష్మీనారాయణ, మత్స్యకార వికాస విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్తశ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్త నిరసనలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వేమయ్యయాదవ్

కదిరి అర్బన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ వైఫల్యాలపై సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 9, 10 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న నిరసనలు జయప్రదంచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ తెలిపారు. బుధవారం ఆపార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అదానీ గ్రూపు కంపెనీల అవినీతిపట్ల కేంద్ర పక్షపాత ధోరణి అవలంబిస్తోందన్నారు. కేంద్రప్రభుత్వ పాత్రపై దర్యాప్తు చేయాలని, అందుకోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు.మణిపూర్‌లో హింసాత్మక పరిస్థితులపై పార్లమెంటులో చర్చించాలన్నారు. సాయుధ బలగాల ప్రత్యేక రక్షణ చట్టం ఉపసంహరించుకోవాలన్నారు. అధిక ధరలు అరికట్టాలని, నిరుద్యోగులను నిర్మూలించాలన్న డిమాండ్‌తో చేపట్టనున్న నిరసనలు జయప్రదం చేయాలన్నారు. ఈసమావేశంలో ఎఐటియుసి మధునాయక్, ఆదెప్ప, ఈశ్వరయ్య, చౌడప్ప, ఎల్‌వి.రమణ, సీపీఐ లియాకత్ తదితరులున్నారు.

మండల కమిటీ ఎన్నిక

నల్లచెరువు, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): స్థానిక గీతామందిరంలో బుధవారం వడ్డెర్ల సంఘం మండల కమిటీ ఎంపిక చేశారు. మండలాధ్యక్షుడుగా డేరంగుల తిరుపాల్, ఉపాధ్యక్షుడిగా వేమయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన డివిజన్ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఆనంద్, వెంకటరమణ, జయరాజు, వీరా, శ్రీరాములు,రామాంజనేయులు, వేమయ్య, ఆంజనేయులు, దొడ్డెప్ప పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి



విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

కొత్తచెరువు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు హరిప్రసాద్‌రెడ్డి, కోనంకి చంద్రశేఖర్ విద్యాశాఖ ఏడీ నాగరాజుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సిలబస్ పూర్తికాకనే పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికను డిసెంబరు 1 నుంచి అమలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. జిల్లా ఉన్నతాధికారులు కూడా పాఠశాలలో సిలబస్ అయిందా లేదా అన్న విషయాలు తెలుసుకోవాలన్నారు. మడకశిర మండలం అమిదాలగొంది ఉన్నతపాఠశాల హెచ్‌ఎం జావిత్‌పై విధించిన సస్పెన్షన్‌ను, వ్యాయామ ఉపాధ్యాయునికి ఇచ్చిన షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలన్నారు. జిల్లా కార్యదర్శి గోపాల్‌నాయక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దొద్దం రవీంద్రనాద్, రవీంద్ర పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

ఘనంగా కనకదాస జయంతి

మడకశిర రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) మండలంలోని ఎఆర్ రొప్పం గ్రామంలో కురుబలు బుధవారం కనకదాస జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు గ్రామంలో జ్యోతులతో వచ్చి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణ, మల్లేశ్ రంగే గౌడ్, గిరీష్ రామచంద్ర, ముత్యాలప్ప నర్సేగౌడ్, కరియప్ప పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు వైద్య పరీక్షలు

పరిగి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇండియన్ గార్మెంట్స్ ఆధ్వర్యంలో బుధవారం కొడిగెనహళ్లి అంధుల పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు యాస్మీన్ మాట్లాడుతూ అంధ విద్యార్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు, రక్తహీనత, వ్యక్తిగత శుభ్రత, తదితర ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. గార్మెంట్స్ యాజమాన్యం ఆదేశాల మేరకు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం సురేష్, హెచ్ఆర్ఎం గార్మెంట్స్ వైద్య సిబ్బంది, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రం చేపల చెరువు వేలం

గోరంట్ల, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలసముద్రం చేపల చెరువుకు శుక్రవారం వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి శంకర్ బుధవారం ఓప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను చెరువులతోచేపలు వదులుకోవడం కోసం ఈనెల 6న బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. గ్రామ సచివాలయంలో సర్పంచ్ ఆధ్వర్యంలో ఉదయం 10.30గంటలకు జరిగే వేలంలో రూ.,50వేలు చెల్లించి పాల్గొన్నాలన్నారు. ఆసక్తిగలవారు వేలంలో పాల్గొన్నాలన్నారు.

మధ్యంతర భృతి వెంటనే చెల్లించాలి


రాజీవ్‌కాలనీ ఉపాధ్యాయులతో ఎస్టీయూ నేతలు

గోరంట్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు గతంలో చెల్లించాల్సిన పీఆర్సీ, డీఏ, సంపాదిత సెలవులు బకాయిలు, మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గోరంట్లలో బుధవారం బాలుర, బాలికలు, ఉర్దూ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో వారి సమస్యలపై చర్చించారు. ఎస్టియుని బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించకూడదన్నారు. సర్వీస్ నిబంధనలు పరిష్కరించి, వెంటనే పదోన్నతులు చేపట్టాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. ఆపార్ వివరాల నమోదు గడువు మరికొంతపెంచాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎస్టియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రవీంద్ర, జిల్లా నాయకులు గోబ్రేనాయక్, స్థానిక నాయకులు విజయకుమార్, సాయిమహేష్; శేషాద్రి, చంద్ర, గోపాల్ తదితరులున్నారు.

పాత డీలర్ నుంచి స్కేలు ఇప్పించండి

సోమందేపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చౌకధాన్య డిపో మాజీ డీలర్ నుంచి స్కేలును తమకు ఇప్పించాలని పత్తికుంటపల్లి గ్రామం డీలర్ క్రిష్ణవేణి బుధవారం కోరారు. ఐదు నెలల క్రితం ప్రభుత్వం తనకు చౌకధాన్యపు డిపోను అప్పగించిందని ఆమె తెలిపారు. ఐదు నెలలు గడుస్తున్నా పాత డీలర్ సుశీలమ్మ ఇంతవరకు తమకు స్కేలు అప్పగించలేదన్నారు. పైగా తాము రేషన్ ఆలస్యంగా అందిస్తున్నామని తనపై ఫిర్యాదులు చేస్తున్నారని వాపోయారు. వైసీపీ నాయకుల అండదండలతో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వాపోయారు. దీనిపై సబ్‌కలెక్టర్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మేలురకం వేరుశనగపై అవగాహన


సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

సోమందేపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం మేలురకం విశిష్ట 1694రకం గురించి శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా.మల్లికార్జున, డా.బాలాజీనాయక్, డా.శిరీషలు మాట్లాడుతూ రైతులు సాధారణంగా వాడే కే-6 రకం వేరుశనగ పంట 90రోజుల నుంచి 100రోజులకు చేతికొస్తుందన్నారు. అందులో దిగుబడి తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. చెట్టుకు కాయలు సైతం తక్కువ మోతాదులో రావడంతోపాటు బుడ్డలు, బొటికలు ఉంటాయన్నారు. అయితే విశిష్ట 1694రకం వేరుశనగ విత్తనాలు విత్తుకుంటే పంట కాలం పెరిగినా చెట్టుకు 30కాయలు వస్తాయన్నారు. అనుమానాలు నివృత్తి చేసుకోదలచిన రైతులు కళ్యాణదుర్గంలోని విజ్ఞాన కేంద్రానికి రావాలని వారు పేర్కొన్నారు. వివరాల కోసం స్థానిక వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అలైఖ్య, వీహెచ్ఎలు ప్రియాంక, సబిహా, బాబావలి, ఆనంద్, వీపీఏ గుడిపల్లి బాలకృష్ణ పాల్గొన్నారు.

నేడు కియను సందర్శించనున్న మంత్రులు

పెనుకొండ రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమ్మవారిపల్లి సమీపంలో యర్రమంచి పొలంలో నెలకొల్పిన కియ కార్లపరిశ్రమను మంత్రులు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవితలు కియ కార్లపరిశ్రమను పరిశీలించనున్నారు. బుధవారం ఉదయం మంత్రులు కియా ప్లాంట్‌ను పరిశీలించనున్నట్లు తెలిపారు.

ఎమ్మార్సీ కార్యాలయానికి పోడియం వితరణ

పెనుకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎమ్మార్సీ కార్యాలయానికి యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో పోడియంను అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయానికి పోడియంను ఎంఈఓ చంద్రశేఖర్, సుధాకర్‌లకు సంఘం తరుపున అందజేశారు. కార్యాలయంలో సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి అనుకూలంగా పోడియంను అందజేసినట్లు తెలిపారు.



డయాలసిస్ రోగులపై దయలేని 108

- బస్సుల్లో ప్రయాణం ప్రయాస
- పింఛన్ సొమ్ము ఖర్చులకే సరి
- ఇబ్బందుల్లో కిడ్నీ రోగులు

హిందూపురం అర్బన్, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి): డయాలసిస్ అంటేనే అంతకన్నా నరకం ఇంకొకటి ఉండదు. ఒక్కసారి రక్తం మొత్తం శుద్ధిచేసి శుద్ధి అయిన రక్తంను ఎక్కించాల్సి ఉంటుంది. ఇలా చేయడంతో డయాలసిస్ చేసిన రెండు రోజులు వారు తీవ్ర నిస్సత్తువతో ఉంటారు. నడవాలంటే కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇంకా అలా కోలుకుంటుంటారో లేదో అంతలోనే మరోమారు డయాలసిస్ సమయం వచ్చేస్తుంది. రోగి పరిస్థితిని పట్టి వారానికి రెండు, లేదా మూడు సార్లు డయాలసిస్ చేసుకోవాల్సి ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో రోగులు వివిధ ప్రాంతాల నుంచి హిందూపురం డయాలసిస్ కేంద్రానికి వస్తుంటారు. అలాంటి వారు బస్సుల్లో రావాలంటే చాల ఇబ్బందికరంగా ఉంటుంది. అందు కోసం 108 సర్వీసులు చేయూతనిచ్చేవి. 108కు ఫోన్ చేస్తే డయాలసిస్ రోగులను ఆసుపత్రికి తీసుకొచ్చేవారు. అయితే గత కొంత కాలంగా 108 సేవలు డయాలసిస్ రోగులకు అందడంలేదు. దీంతో చేసేది లేక రోగులు వ్యయప్రాయసలు పడి ఎలాగోలా బస్సులను, ఆటోలను ఆశ్రయించి ఆసుపత్రికి చేరుతున్నారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో 160 మంది దాకా డయాలసిస్ రోగులు సేవలు పొందుతున్నారు. రోజు 60 నుంచి 70 మందికి చికిత్సలు అందుతున్నాయి. హిందూపురం ప్రాంత వాసులే కాకుండా చెన్నేకొత్తపల్లి, పుట్టపర్తి, ఆగళి, అమరాపురం నుంచి కూడా రోగులు వస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ సొమ్ము రానుపోను ఛార్జీలకు, బయట మందుల కొనుగోలుకు చాలడంలేదని, కుటుంబ సభ్యుల సహకారంతో నెట్టుకొస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. 108 వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


డయాలసిస్ చేయించుకుంటున్న రోగులు

ఒక్క సారి వచ్చి వెళితే రూ. 500 ఖర్చవుతుంది

నేను రెండున్నర ఏళ్లుగా డయాలసిస్ చేయించుకుంటున్నాను. మా ఊరు నుంచి ఒక్కసారి హిందూపురం ఆసుపత్రికి డయాలసిస్ కోసం వచ్చి వెళ్ళాలంటే రూ.500 దాకా ఖర్చవుతుంది. వారానికి 3సార్లు డయాలసిస్‌కు రావాల్సి వుంటుంది. పింఛన్ సొమ్ము దాదాపుగా ఖర్చులకు సరిపోతుంది. 108 సేవలు అందిస్తే బాగుంటుంది.


వెంకటేష్, రోగి

ప్రత్యేక అనుమతి అవసరం

డయాలసిస్ రోగులకు 108 సేవలు అందించాలని లేదు. వారికోసం వెళితే ప్రమాదాలు జరిగిన వారికి సేవలు అందించడం కష్టంగా మారుతుంది. మాకు ప్రభుత్వం నుంచి అనుమతివస్తే సేవలు అందిస్తాం. **రవీంద్ర, మేనేజర్ 108 సర్వీసు**

తుఫాను దెబ్బకు నేలకొరిగిన వరి

భారీ వర్షాలతో లబోదిబోమంటున్న రైతులు


కోనాపురంలో వర్షానికి నేలమట్టమైన వరిపంట

సోమందేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా భారీ ఎత్తున వరిపంటకు నష్టం వాటిల్లింది. తుపానుధాటికి వీచిన గాలులకు వరిపంట నేలకొరిగింది. మండల పరిధిలోని తుంగోడు పంచాయతీ పరిధిలోని కావేటినాగేపల్లి, చిన్నబాబయ్యపల్లి, కొలింపల్లి, కొనతట్టుపల్లి, బూదిమానుపల్లి, గ్రామాల్లో బోర్లకింద రైతులు విరివిగా వరిసాగుచేపట్టారు. ఎకరాకు రూ.40వేలు ఖర్చుచేసి ఆరుగాలం శ్రమించారు. ఎకరా నుంచి ఐదు ఎకరాలవరకు సాగుచేశారు. తీరా పంట చేతికొచ్చి కోతకోసే దశలో తుపాను ప్రభావంవల్ల పంచాయతీ పరిధిలో సుమారు 250ఎకరాల్లో వరి నేలకొరగడంతో లక్షల్లో పంట నష్టం వాటిల్లిందని రైతులు వెంకటరామిరెడ్డి, నరసింహప్ప, భాస్కర్‌రెడ్డి, బాబయ్య, రాజారెడ్డి, రామప్ప, రామాంజినప్ప, రంగారెడ్డి, అంజనాచారి, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలలపాటు పంటను కాపాడుకొచ్చామన్నారు. వడ్డీకి అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టామన్నారు. మందులు, ఎరువులతో పంటను పెంచామన్నారు. పంట డబ్బులతో అప్పులు తీర్చాలని భావించామని, అయితే వర్షం తమ నోటికాడ కూడు లాగేసినట్లు తెలిపారు. అధికారులు తమకు నష్టపరిహారం ఇప్పించాలని వారు కోరారు.

పెనుకొండ రూరల్:

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో దాదాపుగా 300హెక్టార్లకుపైగా రైతులు వరిపంట సాగుచేశారు. మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి మండలంలోని కోనాపురం, మంగాపురం తదితర గ్రామాల్లో వరి పంట వర్షానికి నేలకొరిగింది.

పంటంతా నేలకొరిగింది

ఎకరం పొలంలో వరినాటాను. పంట చేతికొచ్చింది. తొలగించే సమయంలో వర్షాలు రావడంతో పూర్తిగా నష్టపోయాను. **రైతు సదాశివరెడ్డి, కావేటి నాగేపల్లి**



ప్రభుత్వం ఆదుకోవాలి

ఐదెకరాల్లో వేసిన వరిపంట వర్షానికి నేలకొరిగింది. పంట నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలి.
- భాస్కర్‌రెడ్డి, కావేటి నాగేపల్లి



హిందువులపై దాడులు ఆపాలి

ఐక్య వేదిక సంఘం నాయకుల డిమాండ్

హిందూపురం అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు ఆపేలా ప్రభుత్వాలు బంగ్లాదేశ్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, హిందువుల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వాలదే అని హిందూ ఐక్య వేదిక సంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని చిన్నమార్కెట్ పొట్టి శ్రీరాములు సర్కిల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు సంఘీభావ రాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు అమానవనీయమని అన్నారు. అదే విధంగా ఇస్కాన్ ప్రతినిధి ప్రభుదాస్ అక్రమ అరెస్టును నిరసిస్తూ ర్యాలీ చేపట్టామన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపకపోతే తీవ్రంగా స్పందించాల్సి వస్తుందని హెచ్చరించారు. హిందువులు శాంతి కాముకులని ఎవరి జోలికి వెళ్ళరన్నారు. వారి జోలికి వస్తే వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఎప్పుడు పరాయి దేశాలవారు హిందువులపైన హిందూ దేశాలపైన దండయాత్రలు చేసి దోచుకున్నారన్నారు. హిందూ దేశాలు ఇతర దేశాలపై దాడులు చేయలేదని, అది తమ సంస్కారం కాదని అన్నారు. ఇంకొకరి సొమ్మును ఆశించేవారు హిందువులు కాదని హితవు పలికారు. కార్యక్రమంలో హిందూ సంఘాల ఐక్యవే దిక నాయకులు పాల్గొన్నారు.



సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల ఐక్యవేదిక సభ్యులు

ఆరోగ్య భారతిపై అవగాహన

అమరాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అమరాపురం మండల కేంద్రంలోని సరస్వతీ విద్యా మందిరంలో ఆరోగ్య భారత అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడం జరుతుందని డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. ఆరోగ్య భారతి అఖిల భారత సహాయ కార్యదర్శి డాక్టర్ నాగేశ్వరరావు, ఆయుర్వేద ఎండీ ఆరోగ్య భారతి, అనంతపురం జిల్లా అధ్యక్షులు డాక్టర్ అనూరాధ పాల్గొన్నారు. ఆరోగ్య శిబిరానికి అమరాపరం నుండి 40 మంది గృహిణులు గ్రామ పెద్దలు సత్యనారాయణ, చంద్రశేఖర్, నాగభూషణ్, లింగేష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

గోరంట్ల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి ప్రధాన రహదారిపై జీనవాండ్లపల్లి వద్ద బుధవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఈశ్వరయ్య, శివాకుమార్‌నాయక్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ఓడీసీ మండలానికి చెందిన శివకుమార్‌నాయక్ ద్విచక్రవాహనంపై గోరంట్లకు వస్తుండగా జీనవాండ్లపల్లికి చెందిన ఈశ్వరయ్య ద్విచక్రవాహనంపై ఎదురుగా వస్తూ పరస్పరం ఢీకొన్నారు. ఈశ్వరయ్యకు కాలువిరగగా, గాయపడిన ఇరువురిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ ఉషా చికిత్సలు చేశారు. మెరుగైన వైద్యంకోసం హిందూపురం తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీ .. ఒకరి మృతి

పావగడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంగవరం క్రాస్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని శివప్ప(26) అనే యువకుడు మృతి చెందగా హనుమంతరాయప్ప, ఉమేష్ అనే వారు తీవ్రంగా గాయాలపాలైన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వ్యవసాయ పనులు చేసుకొంటూ నివసిస్తున్న శివప్ప మంగళవారం మధ్యాహ్నం పావగడకు వచ్చి తన మిత్రుడితో కలిసి ద్విచక్రవాహనంలో స్వగ్రామమైన మరిదాసనహళ్లికి రాత్రి 9 గంటల సమయంలో తిరిగి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం వచ్చి ఢీకొనడంతో శివప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. హనుమంతరాయప్ప, ఉమేష్‌కు తీవ్రగాయాలు కాగా వారిని ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం వీరిని బెంగళూరుకు తరలించి ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆభరణాల అపహరణ


నగలు చోరీ అయిన బీరువా

హిందూపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్నమార్కెట్ సమీపంలో పద్మ అనే మహిళ ఇంట్లో దొంగలు పడ్డారు. 8.5 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. పద్మ ఈనెల 1న వితంతు పింఛన్ తీసుకుని, పుట్టింటికి వెళ్లారు. దీనిని అదనుగా తీసుకున్నదొంగలు ఇంటి తలుపులకున్న తాళాలు పగులకొట్టి, లోపలికి చొరబడ్డారు. బీరువాలోని బంగారు ఆభరణాలు, కొంత నగదు ఎత్తుకెళ్లారు. పద్మ బుధవారం హిందూపురానికి వచ్చారు. తలుపు తాళాలు తీసి ఉండడాన్ని చూసి, చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నారు. టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ అయిన ఆభరణాల విలువ రూ.5లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపారు. కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

మడకశిరటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి గాంచిన భక్తరపల్లి లక్ష్మీ నరసింహస్వామి, జిల్లెడిగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో బ్రహ్మోత్సవ ప్రచార రథాన్ని ప్రారంభించారు.

చంద్రబాబును చూసే పార్టీలోకి వలసలు


సభ్యులను ఆహ్వానిస్తున్న తిప్పేస్వామి

మడకశిర టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని, రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషితో పలువురు ఇతర పార్టీల నేతలు తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నట్లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. బుధవారం టీడీపీ పార్టీ కార్యాలయం ఆవరణంలో వైసీపీకి చెందిన సి.కొడిగేపల్లి పంచాయతీ పరిధిలోని నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులు, హనుమంతరాయప్ప, లింగప్ప, భాగ్యమ్మతోపాటు పది కుటుంబాలు తెలుగుదేశం పార్టీలోకి చేరారు.

క్రైం కార్నర్

దొంగల హల్‌చల్

● ఐదు షాపుల్లో చోరీలు ● పోలీసు స్టేషన్ సమీపంలోనే..


షాపు తాళాలు పగలగొట్టిన దృశ్యం

మడకశిరటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):పట్టణంలో మంగళవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. అదీ పోలీసు స్టేషన్ సమీపంలోనే. ప్రధాన రహదారి పక్కనే ఉన్న షాపుల్లో చోరీలకు పాల్పడ్డారు. తద్వారా పోలీసులకు సవాల్ విసిరారు. పట్టణంలోని మారుతీనగర్, అమరాపురం ప్రధాన రహదారి కూడళ్లలో వరుస చోరీలు జరుగుతున్నాయి. వాటిని అరికట్టడంలో పోలీసులు విఫలమవుతున్నారని పట్టణ వాసులు విమర్శలు గుప్పిస్తున్నారు. రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించకపోవడం వల్ల ప్రధాన రహదారి పక్కనే ఉన్న షాపుల్లో చోరీలకు పాల్పడుతున్నారని వారు చెబుతున్నారు. మంగళవారం రాత్రి రెండు మెడికల్ షాపులు, బేకరీ, కిరాణా కొట్టులో దొంగలు పడ్డారు. పోలీసు స్టేషన్ సమీపంలోనే చోరీలు చేయడాన్ని బట్టి చూస్తే గస్తీ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక దుకాణంలో రూ.వెయ్యి, మరో రెండు షాపుల్లో రూ.2వేలు చొప్పున, కిరాణా అంగట్లో రూ.6వేలు అపహరించారు. ఇప్పటికైనా పోలీసులు గస్తీ నిర్వహించి, చోరీలను అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం..

లోకేశ్‌కు ఎస్ఎఫ్ఐ కృతజ్ఞతలు

హిందూపురం అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని పలుమార్లు చేసిన నివేదనపై ఆయన స్పందించారన్నారు. విద్యార్థుల అవస్థలు గ్రహించిన మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించి ఇంటర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తామని ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు.

ఎస్ఐగా రాజకుళ్లాయప్ప


రాజకుళ్లాయప్ప

గుడిబండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుడిబండ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఎం.రాజకుళ్లాయప్ప బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ మునిప్రతాప్ హిందూపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా, పుట్టపర్తి వీఆర్‌లో ఉన్న రాజకుళ్లాయప్పను ఉన్నతాధికారులు గుడిబండ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. బదిలీ అయిన మునిప్రతాప్‌ను పోలీసు సిబ్బంది సన్మానించారు.

జమ్మానిపల్లిలో వెలిగిన వీధి దీపాలు


విద్యుత్ స్తంభాలకు లైట్లు బిగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మడకశిర రూరల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి) ఎట్టకేలకు అధికారుల్లో చలనం వచ్చింది. జమ్మానిపల్లిలో వీధి దీపాలను వెలిగించారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం 'అంధకారంలో జమ్మానిపల్లి' అనే శీర్షికతో వెలువడిన కథనంపై అధికారులు వెంటనే స్పందించారు. ఆ గ్రామానికి వెళ్లి వీధుల్లో వెలగని విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లను అమర్చి వాటిని వెలిగించారు. గ్రామస్థులందరూ సంతోషాన్ని వ్యక్తంచేసి ఆంధ్రజ్యోతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అధ్యాపకుల సంఘం కార్యవర్గం ఎన్నిక


జయప్ప, అనిల్‌కుమార్

పెనుకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : శ్రీసత్య సాయిజిల్లా ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి డా.రాజశేఖర్ ఆర్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. నూతన సంఘం అధ్యక్షులుగా డా.జయప్ప, పెనుకొండ, ప్రధాన కార్యదర్శిగా నాయక్ అనీల్‌కుమార్, మడకశిర, కార్యదర్శిగా సుమంగళి హిందూపురం మహిళా కళాశాల, కోశాధికారిగా డా.కృష్ణానాయక్ కదిరి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల పర్యవేక్షకులుగా అనంతపురం ప్రభుత్వ కళాశాల అధ్యాపక సంఘం అధ్యక్షుడు డా.శ్రీధర్ కోనంకి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీలక్ష్మీ, హరిప్రసాద్, శ్రీనివాసులు, చంద్రశేఖర్, నాగమణి, రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల జయంతి


ఘంటసాలకు నివాళులు అర్పిస్తున్న అభిమానులు

హిందూపురం అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 101వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఘంటసాల మెమోరియల్ హాల్‌లో ఘంటసాల కళామందిరంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భౌతికంగా ఘంటసాల వెంకటేశ్వరరావు మన మధ్య లేకపోయినా ఆయన పాడిన మధుర గీతాలు నేటికి ఎంతో ఆదరణ పొందుతున్నాయన్నారు. పాటల రూపంలో ఆయన మన అందరి మధ్య చిరస్థాయిగా ఉన్నాడన్నారు. ఈ సందర్భంగా ఆయన పాటలను పాడి అలరించారు. కార్యక్రమంలో ఘంటసాల కళామందిర్ సమితీ గౌరవాధ్యక్షుడు నంబూరి శంకర్, వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రసాదరావు, డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్, ఎంఈఓ గంగప్ప, కార్యదర్శి లోకేష్, లైఫ్‌వరల్డ్ ఉదయ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

చెట్టు కూలి ఇంటి పైకప్పు ధ్వంసం

ఇంట్లోవారికి తృటిలో తప్పిన ప్రమాదం

హిందూపురం అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చెట్టు కూలిఇంటి పైకప్పు ధ్వంసమైన సంఘటన పట్టణ పరిధిలోని బెంగళూరు రోడ్డు అయ్యప్పస్వామి గుడి పక్కన బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. స్థానిక సాంఘిక సంక్షేమ అధికారి కార్యాలయంలోని నుంకేసుర చెట్టు కార్యాలయం పక్కనే ఉన్న సద్దాం అనే ఆటో డ్రైవర్‌కు సంబంధించిన రేకుల ఇంటిపై కూలింది. ఈ ఘటనలో ఇంటి పైకప్పుకు ఉన్న సిమెంట్ రేకులు ధ్వంసమయ్యాయి. అయితే చెట్టు వంటగదిపై పడిందని అదే హాల్‌పై పడి ఉంటే ప్రమాదం జరిగి ఉండేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. తెల్లవారు జామున ఇంటిలోని 5 గురు నిద్రిస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే వంటగదిపై పడటంతో పెను ప్రమాదం తప్పింది. కష్టపడి పైసా పైసా కూడబెట్టుకుని ఇల్లు నిర్మించుకున్నామని ఇలా జరిగిందని ఆవేదన చెందాడు. అయితే ఆ వార్డు టీడీపీ నియోజక వర్గ మైనార్టీ అధ్యక్షుడు హిదాయత్, టీడీపీ నాయకుడు ఇందాద్‌లు ఇంటి పైకప్పుకు సాయం చేస్తామని హామీ ఇచ్చారు.

గుట్టూరులో ఉచిత కంటి వైద్యశిబిరం

పెనుకొండరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుట్టూరులో ప్రభాత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించినట్లు సొసైటీ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కియా పరిశ్రమ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరానికి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ అనురాధ హాజరై మాట్లాడారు. కియా పరిసర ఎనిమిది గ్రామాల్లో దాదాపు 728మందికి కంటిపరీక్షలునిర్వహించగా 152మంది ఆపరేషన్లకు ఎంపికయ్యారన్నారు. బెంగళూరు మంజునాథ నేత్రాలయ ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు.